TGTEL/26/A7716

ఉద్యమ పోరు

UDYAMA PORU

ప్రతి పదం పోరాట కదం

వరంగల్ | సంపుటి : 1 | సంచిక : 22 | సోమవారం | 05.10.2026 | పేజీలు : 8 | వెల : 3 /- | ఎడిటర్ - బండారి సుమంత్

కొండా లక్ష్మణ్ బాపూజీ కుమార్తెకు ఎమ్మెల్సీ పదవి?

- గవర్నర్ కోటా ఎమ్మెల్సీగా పవిత్రవాణి పేరు పరిశీలన
- సిరిసిల్ల సభలో పద్మశాలి వర్గానికి ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ అడుగులు
- తెలంగాణ ఉద్యమకారుల కుటుంబాలకు ప్రాధాన్యం ఇస్తున్న రేవంత్ సర్కార్

2

చందమామపై కరెంటు కోసం అణుశక్తి.. అగ్రదేశాల భారీ ప్లాన్!

- చంద్రుడిపై అణు రియాక్టర్లకు అమెరికా, చైనా, రష్యా సిద్ధం
- 2030 నాటికి రియాక్టర్ ప్రయోగానికి నాసా అడుగులు
- 20 కిలోవాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసే నాసా రియాక్టర్ రూపకల్పన
- 2036కి సిద్ధం చేయనున్న రష్యా 'సెలీనా' రియాక్టర్

2

ప్రపంచం పాక్ వైపు ఉన్నప్పుడు.. రష్యా మాత్రం భారత్‌కు అండగా నిలిచింది : జైశంకర్

- భారత్‌కు రష్యా అండగా నిలిచిందన్న జైశంకర్
- 1950ల నుంచే ఇరు దేశాల మధ్య బంధమని వెల్లడి
- పశ్చిమ దేశాల విమర్శలపై భారత్ వైఖరి స్పష్టీకరణ
- రష్యాతో వాణిజ్యం, ఇంధన సహకారం కొనసాగింపు
- ఉక్రెయిన్ యుద్ధానికి చర్చలే పరిష్కారమన్న భారత్

2

కాలిఫోర్నియా హెల్త్ ఫెస్ట్‌కు కేటీఆర్‌కు ఆహ్వానం

- యూఎస్ శాన్ డియాగోలో అక్టోబర్ 30న సదస్సు నిర్వహణ.
- హెల్త్‌కేర్‌లో సరికొత్త టెక్నాలజీ, AI, డిజిటల్ హెల్త్, పర్సనలైజ్డ్ మెడిసిన్ అంశాలపై ప్రపంచ నిపుణులతో కలిసి ఆలోచనలు పంచుకోనున్న కేటీఆర్.
- వైద్య రంగంలో వస్తున్న సాంకేతిక విప్లవంపై కీలక ప్రసంగం చేయనున్న కేటీఆర్ .

ఉద్యమపోరు, డెస్క్ : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు మరో అంతర్జాతీయ ఆహ్వానం అందింది. అమెరికాలోని కాలిఫోర్నియాలో నిర్వహించనున్న TALHealthFest 2026కు విశిష్ట అతిథిగా ఆహ్వానం వచ్చింది. అక్టోబర్ 30న యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా శాన్ డియాగో (UC San Diego)లో జరగనున్న అంతర్జాతీయ ఆరోగ్య సదస్సుకు కేటీఆర్‌ను ఆహ్వానించినట్లు నిర్వాహకులు తెలిపారు.....

2

ఎస్ఎల్‌బీసీ పనుల్లో

ఇక దూకుడే!

కేబీఆర్ పార్క్ చుట్టూ హెచ్-సిటి ప్లాన్‌లో భారీ మార్పు..

- ఎస్ఎల్‌బీసీ పనుల్లో కీలక ముందడుగు
- క్లిష్టమైన షియర్ జోన్‌ను అధిగమించిన కార్మికులు
- సొరంగం పనులు 79 శాతం పూర్తి
- ఐదు నెలల్లో 700 మీటర్ల తవ్వకాలు
- 2028 జూన్ నాటికి నీటి విడుదల లక్ష్యం

ఉద్యమపోరు, హైదరాబాద్ : ఎస్ఎల్‌బీసీ సొరంగం పనుల్లో కీలక ముందడుగు పడింది. తవ్వకాలకు తీవ్ర ఆటంకంగా మారిన క్లిష్టమైన భౌగోళిక ప్రాంతాన్ని అధిగమించారు. దీంతో పనుల వేగం పెంచేందుకు మార్గం సుగమమైంది. అదనపు యంత్రాలను అందుబాటులోకి తెచ్చి పనులను మరింత వేగవంతం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. 2028 జూన్ నాటికి సొరంగం ద్వారా నీటిని అందించడమే లక్ష్యంగా ముందుకెళుతున్నట్లు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని మూడు జిల్లాల ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులతో మంత్రి ఆదివారం సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ఎస్ఎల్‌బీసీ సహా కీలక సాగునీటి ప్రాజెక్టుల పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సొరంగం పూర్తయితే కరవు పీడిత ప్రాంతాలకు 30 టీఎంసీలకు పైగా నీరు అందనుంది. సొరంగం మొత్తం పొడవు 43.968 కిలోమీటర్లు కాగా, ఇప్పటివరకు 79 శాతం పనులు పూర్తయ్యాయి. ....

2

గ్యారెంటీలకు గోరీ కట్టిన రేవంత్ రెడ్డి - హరీష్ రావు

- కన్నెపల్లిలో కట్క ఒత్తితే మల్లన్నసాగర్‌లో నీళ్లు దుంకుతయ్
- గోదావరి నీళ్లు ఎత్తలేని దుస్థితిలో కాంగ్రెస్ సర్కార్
- బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత హరీశ్‌రావు ధ్వజం

ఉద్యమపోరు, గజ్వేల్ : 'నల్లమల పులి అని చెప్పుకొంటున్న రేవంత్‌రెడ్డి.. నువ్వు పులివి కాదు.. రంగులు మార్చే ఊసరవెల్లివి' అని బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత హరీశ్‌రావు అన్నారు. అధికారంలోకి రాగానే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని హామీ ఇచ్చిన రేవంత్‌రెడ్డి గ్యారెంటీలకు గోరీలు కట్టి, బాండ్ పేపర్లను బొంద పెట్టిండని విమర్శించారు. ఆదివారం సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని వంద మందికి డ్రిల్లింగ్ మెషిన్లను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు అలీ మస్కత్ సౌజన్యంతో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. తెలంగాణలో కాలం తెచ్చిన కరువు కాదని.. కాంగ్రెస్ తెచ్చిన కరువని మండిపడ్డా రు. కేసీఆర్ రైతుల సాగునీటి కష్టాలు తీర్చేందుకు కొండపోచమ్మ, మల్లన్నసాగర్ ప్రాజెక్టులు, చెక్‌డ్యామ్‌లు నిర్మించి కాలువల ద్వారా ప్రతి ఎకరాకూ నీళ్లు అందించిన విషయాన్ని గుర్తుచేశారు. ....

2

సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై విజిలెన్స్ విచారణ.. కేరళలో పాత కేసు రీఓపెన్

- 2006లో మలేషియన్ ఇంజనీర్ ఆత్మహత్య కేసులో తిరిగి దర్యాప్తుకు ఉత్తర్వులు
- నాటి విచారణపై బాహ్య ఒత్తిళ్లు వచ్చాయన్న ఆరోపణల నేపథ్యంలో తాజా చర్యలు
- కాంగ్రెస్ నేత వేసిన పిటిషన్ ఆధారంగా కేరళ హోంమంత్రి ఆదేశాలు

2

మెడికవర్ హాస్పిటల్ ఎదుట ఫ్లెక్సీల కలకలం

- రేవంత్ ఫ్యామిలీ పెట్టుబడుల వల్లే అక్రమాస్తులు సమకూరాయంటూ బీఆర్ఎస్ నేత క్రిశాంక్ ఆధారాలు బయట పెట్టిన నేపథ్యంలో ఈ ఫ్లెక్సీ ఏర్పాటు కలకలం
- ఇద్దరిని అరెస్ట్ చేసిన పోలీసులు
- మరో ఆరుగురి కోసం గాలింపు

2

మైనింగ్ ముప్పు నుంచి రామప్పను రక్షించండి

- ఓపెన్‌కాస్ట్ మైనింగ్ నుంచి రామప్పను రక్షించండి
- రామప్ప ఆలయం, చెరువును బొగ్గు తవ్వకాలకు బలిపెట్టొద్దు
- చారిత్రక సంపదను కాపాడాలని వేడుకోలు
- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ వినతి

2

మైనింగ్ ముప్పు నుంచి రామప్పను రక్షించండి

మొదటిపేజీ తరువాయి.. ప్రపంచ వారసత్వ కట్టడం రామప్పను సింగరేణి ఓపెన్‌కాస్ట్ మైనింగ్ నుంచి రక్షించాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ కోరింది. తెలంగాణ నుంచి ఉన్న ఒకే ఒక యునెస్కో గుర్తింపు నిర్మాణాన్ని కాపాడకపోతే భవిష్యత్ తరాలు క్షమించవని విజ్ఞప్తి చేసింది. ఆదివారం హైదరాబాద్‌లో కేంద్ర మంత్రిని కలిసి రామప్ప ఆలయ ప్రాముఖ్యత, చారిత్రక ప్రాధాన్యత, యునెస్కో గుర్తింపు నేపథ్యం తదితర అంశాలను కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ ప్రతినిధులు వివరించారు. రామప్ప గుడిని, 3 టీఎంసీల నీటి నిలువ ఉండే రామప్ప చెరువును సింగరేణి ఓపెన్‌కాస్ట్ తవ్వకాల కోసం బలిపెట్టొద్దని కోరారు. శిల్పకళా విశ్వవిద్యాలయంగా భాసిల్లిన రామప్పకు ఓపెన్‌కాస్ట్ మైనింగ్ వల్ల తీవ్ర ముప్పు పొంచి ఉన్నదని ఆధారాలతో సహా వివరించారు. కేంద్రం కలుగజేసుకొని రామప్పను రక్షించాలని కోరారు. కేంద్రమంత్రిని కలిసిన వారిలో ప్రొఫెసర్ పాండు రంగారావు, వరంగల్ మాజీ మేయర్ టీ రాజేశ్వర్‌రావు, నరహరి వేణుగోపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కాలిఫోర్నియా హెల్త్ ఫెస్ట్‌కు కేటీఆర్‌కు ఆహ్వానం

మొదటిపేజీ తరువాయి.. టచ్–ఎ–లైఫ్ ఫౌండేషన్ సీఈవో సాయి గుండవెల్లి కేటీఆర్‌కు ప్రత్యేక ఆహ్వానం పంపినట్లు పేర్కొన్నారు. ఆరోగ్య రంగంలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, భవిష్యత్ వైద్య విధానాలు, ఆవిష్కరణలపై సదస్సులో విస్తృతంగా చర్చించనున్నారు. సదస్సులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI), డిజిటల్ హెల్త్, పర్సనలైజ్డ్ మెడిసిన్, మెడికల్ టూరిజం తదితర అంశాలపై అంతర్జాతీయ నిపుణులు చర్చించనున్నారు. వైద్యం, సాంకేతికత, ఆవిష్కరణల రంగాల్లో చోటుచేసుకుంటున్న మార్పులపై వివిధ దేశాలకు చెందిన ప్రముఖులు తమ అభిప్రాయాలను పంచుకోనున్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ కూడా ఆరోగ్య రంగంలో సాంకేతికత వినియోగం, ఆవిష్కరణలు, డిజిటల్ హెల్త్ తదితర అంశాలపై తన ఆలోచనలను అంతర్జాతీయ వేదికపై పంచుకోనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు.

ప్రపంచం పాక్ వైపు ఉన్నప్పుడు.. రష్యా మాత్రం భారత్‌కు అండగా నిలిచింది - జైశంకర్

మొదటిపేజీ తరువాయి.. భారత్–రష్యా సంబంధాలు నేటివి కావని, దాని వెనుక దశాబ్దాల చరిత్ర ఉందని విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ స్పష్టం చేశారు. భారత్ భద్రత, ప్రాదేశిక సమగ్రతకు ముప్పు వచ్చిన సందర్భాల్లో రష్యా అండగా నిలిచిందని గుర్తుచేశారు. ఒక దేశంతో సంబంధాలను మరో దేశం అనుభవంతో పోల్చి చూడలేమని స్పష్టం చేశారు. ఢిల్లీలో ఆదివారం జరిగిన మ్యూనిక్ భద్రతా సమావేశంలో జైశంకర్ మాట్లాడారు. 1950ల నుంచి భారత్, రష్యా మధ్య మంచి సంబంధాలు కొనసాగుతున్నాయని చెప్పారు. అప్పట్లో ప్రపంచంలోని చాలా దేశాలు పాకిస్థాన్‌లోని సైనిక పాలనకు మద్దతుగా ఉన్నా.. రష్యా మాత్రం భారత్‌కు అండగా నిలిచిందని పేర్కొన్నారు. ఆ చరిత్రను తాము మర్చిపోలేమన్నారు. పశ్చిమ దేశాలు రష్యాతో భారత్ సంబంధాలపై ప్రశ్నలు లేవనెత్తుతున్న నేపథ్యంలో జైశంకర్ ఈ వ్యాఖ్యలు చేశారు. యూరప్‌కు రష్యాతో ఉన్న అనుభవం వేరు, భారత్‌కు ఉన్న అనుభవం వేరని చెప్పారు. భారత్ దృష్టిలో రష్యాతో సంబంధాలు ఇప్పటికీ సానుకూలంగానే ఉన్నాయని తెలిపారు.

చందమామపై కరెంటు కోసం అణుశక్తి.. అగ్రదేశాల భారీ ప్లాన్!

మొదటిపేజీ తరువాయి.. చంద్రుడిపై శాశ్వత స్థావరాలు ఏర్పాటు చేసేందుకు అగ్రరాజ్యాలు సిద్ధమవుతున్నాయి. ఇందులో భాగంగా అమెరికా, చైనా, రష్యా ఇప్పుడు చంద్రుడిపై అణు రియాక్టర్ల ఏర్పాటుపై దృష్టి పెట్టాయి. భవిష్యత్తులో చంద్రుడిపై ఎక్కువ కాలం మనుషులు ఉండాలన్నా, అక్కడి వనరులను అన్వేషించాలన్నా విద్యుత్ కీలకం. అందుకే ఈ మూడు దేశాలు అణుశక్తిని ప్రత్యామ్నాయంగా చూస్తున్నాయి. ఓ చిన్న అణు రియాక్టర్ తయారీకి కంపెనీల నుంచి ఆగస్టులో నాసా ప్రతిపాదనలు కోరినట్లు 'ది న్యూయార్క్ టైమ్స్' వెల్లడించింది. చంద్రుడి దక్షిణ ధ్రువం సమీపంలో పనిచేసేలా దీన్ని రూపొందించనున్నారు. 2030 డిసెంబరు నాటికి ప్రయోగానికి సిద్ధం చేయాలన్నది లక్ష్యం. ఈ రియాక్టర్ 20 కిలోవాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తూ ఐదేళ్ల పాటు మానవ జోక్యం లేకుండా పనిచేసేలా రూపొందించాలని భావిస్తున్నారు. చైనా కూడా చంద్రుడిపై అణుశక్తిని ఉపయోగించే ప్రణాళికలతో ముందుకెళ్తోంది. చైనాతో కలిసి రష్యా 'సెలీనా' పేరుతో రియాక్టర్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు సమాచారం. 2036 నాటికి దీన్ని సిద్ధం చేయాలని రష్యా లక్ష్యంగా పెట్టుకుంది. ఇది 10 కిలోవాట్ల వరకు విద్యుత్ అందిస్తూ పదేళ్ల పాటు సొంతంగా పనిచేసేలా రూపొందించనున్నారు. ఈ పోటీ మరో కీలక ప్రశ్నను కూడా తెరపైకి తెచ్చింది. 1967లో కుదిరిన ఔటర్ స్పేస్ ట్రీటీ ప్రకారం ఏ దేశమూ చంద్రుడిని తన భూభాగంగా ప్రకటించుకోకూడదు. అయితే భవిష్యత్తులో స్థావరాల చుట్టూ ఇతర దేశాల ప్రవేశాన్ని పరిమితం చేయవచ్చా? చంద్రుడి నుంచి తీసే వనరులపై హక్కులు ఎవరికి ఉంటాయి? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సాంకేతిక, భద్రతా సవాళ్ల కారణంగా మూడు దేశాల ప్రస్తుత గడువులు మారే అవకాశం కూడా ఉంది.

ఎస్ఎల్‌బీసీ పనుల్లో ఇక దూకుడే!

మొదటిపేజీ తరువాయి.. ఇంకా 9.1 కిలోమీటర్ల మేర తవ్వకాలు చేపట్టాల్సి ఉంది. గత ఐదు, ఆరు నెలల్లో ఇన్‌లెట్, ఔట్‌లెట్ మార్గాల్లో కలిపి సుమారు 700 మీటర్ల మేర పనులు పూర్తయ్యాయి. అత్యంత క్లిష్టమైన షియర్ జోన్‌ను దాటడం ఈ పురోగతిలో కీలకమని మంత్రి పేర్కొన్నారు. సొరంగం తవ్వకాల సమయం లో గతేడాది ఫిబ్రవరిలో ఎనిమిది మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. దీంతో ప్రస్తుతం భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. బలహీనమైన భూభాగం, రాళ్లు విరిగిపడే ప్రమాదాలున్న చోట ప్రత్యేక రక్షణ ఏర్పాట్లు చేశారు. 140 మిల్లీమీటర్ల మందం కలిగిన పైపులతో రక్షణ కవచం ఏర్పాటు చేసి తవ్వకాలు కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం రోజుకు సగటున ఏడు నుంచి ఏడున్నర మీటర్ల మేర తవ్వకాలు జరుగుతున్నాయి. ఔట్‌లెట్ వద్ద మూడు చేతుల డ్రిల్లింగ్ యంత్రం పనిచేస్తుండగా, అక్టోబరులో ఇన్‌లెట్ వద్ద మరో యంత్రాన్ని అందుబాటులోకి తీసుకురానున్నారు. జర్మనీ నుంచి తెప్పిస్తున్న ప్రత్యేక రైలు ఈ నెలాఖరుకు చేరుకోనుంది. దీంతో సొరంగం లోపల తవ్విన మట్టిని, రాళ్లను వేగంగా బయటకు తరలించే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ఒక విడత తవ్వకాల పనులు పూర్తి కావడానికి 20 నుంచి 24 గంటలు పడుతోంది. కొత్త యంత్రాలు, మెరుగైన రవాణా సదుపాయాలతో ఈ సమయాన్ని పది గంటలకు తగ్గించాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. అక్టోబరు చివరి నుంచి పనుల్లో మరింత వేగం పెంచాలని మంత్రి ఆదేశించారు. కార్మికుల భద్రత విషయంలో ఎలాంటి రాజీ లేకుండా, నిర్ణీత గడువులోగా ప్రాజెక్టును పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

మెడికవర్ హాస్పిటల్ ఎదుట ఫ్లెక్సీల కలకలం

మొదటిపేజీ తరువాయి.. సికింద్రాబాద్ మెడికవర్ హాస్పిటల్ ముందు ఆదివారం ఉదయం వెలిసిన ఫ్లెక్సీలు కలకలం రేపాయి. మెడికవర్ హాస్పిటల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఉన్న డాక్టర్ శరత్ రెడ్డి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అల్లుడు సత్యనారాయణరెడ్డి డైరెక్టర్‌గా ఉన్న మ్యాక్స్ బీన్ ఫార్మాలో భాగస్వామిగా ఉన్నారని బీఆర్ ఎస్ నాయకులు కొద్ది రోజుల క్రితం ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. మెడికవర్ హాస్పిటల్, మ్యాక్స్ బీన్ ఫార్మా మధ్య ఉన్న సంబంధాలు వెల్లడించాలంటూ డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో రూ. 13,200 కోట్ల బాగోతానికి సంబంధించిన ఫ్లెక్సీలు హాస్పిటల్ పరిసర ప్రాంతాల్లో వెలిశాయి. సమాచారం అందుకున్న గోపాలపురం పోలీసులు అక్కడికి చేరుకుని ఫ్లెక్సీలను తొలగించారు. జీహెచ్ఎంసీ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కంటోన్మెంట్, పికెట్ ప్రాంతాని కి చెందిన సాయికిరణ్, వినీత్‌ను అదుపులోకి తీసుకున్నారు. మరో ఆరుగురి కోసం గాలిస్తున్నట్టు తెలిసింది. ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారంటూ బీఆర్ఎస్ కార్యకర్తలను అరెస్టు చేయడంపై గులాబీ వర్గాలు మండిపడుతున్నాయి.

సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై విజిలెన్స్ విచారణ.. కేరళలో పాత కేసు రీఓపెన్

మొదటిపేజీ తరువాయి.. ప్రస్తుత భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌పై తాజాగా విజిలెన్స్ విచారణకు కేరళ ప్రభుత్వం ఆదేశించింది. ఆయన గతంలో కేరళ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ (పీడబ్ల్యూడీ) సెక్రటరీగా పని చేసిన సమయంలో వచ్చిన ఆరోపణలకు సంబంధించి ఈ విచారణ జరగనుంది. కాంగ్రెస్ నేత మలయిన్‌కీళు వేణుగోపాల్ సమర్పించిన పిటిషన్ ఆధారంగా, రాష్ట్ర హోంమంత్రి రమేశ్ చెన్నితాల ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కేసు 2006 నాటిది. కేరళ రాష్ట్ర రవాణా ప్రాజెక్ట్ (కేఎస్‌టీపీ) కింద ఎంసీ రోడ్డు అభివృద్ధి పనుల్లో భాగస్వామిగా ఉన్న పాటి–బెల్ కన్సార్టియం తరఫున పనిచేసిన మలేషియన్ సివిల్ ఇంజనీర్ లీ సీ బీన్, కేరళ నుంచి తిరిగి వెళ్లాక 2006 నవంబర్‌లో కౌలాలంపూర్‌లో ఆత్మహత్య చేసుకున్నారు. ఆయన రాశారని చెబుతున్న సూసైడ్ నోట్‌లో అప్పటి పీడబ్ల్యూడీ సెక్రటరీగా ఉన్న జ్ఞానేశ్ కుమార్ పేరు ఉన్నట్లు ఆరోపణలు వచ్చాయి. ప్రాజెక్టు పనుల్లో అవకతవకలు జరిగాయని, ఈ కేసులో 2006లో జరిగిన ప్రాథమిక విజిలెన్స్ విచారణ బాహ్య ఒత్తిళ్ల కారణంగా పక్కదారి పట్టిందని వేణుగోపాల్ తన పిటిషన్‌లో ఆరోపించారు. ఈ ఆరోపణలను తీవ్రంగా పరిగణించిన హోంమంత్రి రమేశ్ చెన్నితాల, నాటి విచారణకు సంబంధించిన ఫైళ్లన్నింటినీ వెంటనే తమకు సమర్పించాలని 'విజిలెన్స్ అండ్ యాంటీ కరప్షన్ బ్యూరో'ను (వీఏసీబీ) ఆదేశించారు. ఆనాటి దర్యాప్తు ఎలా జరిగింది, నిజంగానే ఏవైనా బయటి శక్తులు దానిని ప్రభావితం చేశాయా అనే కోణంలో ఈ ఫైళ్లను పరిశీలించనున్నారు. నాటి విచారణపై వచ్చిన జోక్యం ఆరోపణలపై సమగ్ర దర్యాప్తు జరిపి, నివేదిక ఆధారంగా తగిన చర్యలు తీసుకోవాలని విజిలెన్స్ డైరెక్టర్‌ను హోంమంత్రి ఆదేశించారు. అయితే, సూసైడ్ నోట్‌లో పేరు ప్రస్తావించినంత మాత్రాన లేదా తాజా విచారణకు ఆదేశించినంత మాత్రాన జ్ఞానేశ్ కుమార్ తప్పు చేసినట్లు నిర్ధారణ కాదని స్పష్టమవుతోంది. విజిలెన్స్ దర్యాప్తులో వెల్లడయ్యే వాస్తవాల ఆధారంగా ప్రభుత్వం తదుపరి చర్యలు తీసుకోనుంది. ప్రస్తుతానికి పాత రికార్డులను పరిశీలించి, జోక్యం ఆరోపణలపై దృష్టి సారించడం ఈ విచారణ ప్రధాన ఉద్దేశం.

గ్యారెంటీలకు గోరీ కట్టిన రేవంత్ రెడ్డి - హరీష్ రావు

మొదటిపేజీ తరువాయి.. కన్నెపల్లిలో కట్క ఒత్తితే నీళ్లు మల్లన్నసాగర్‌లోకి నీళ్లు దుంకుతాయని తెలిపారు. గోదావరిలో పారుతున్న నీళ్లను ఎత్తలేని దుస్థితిలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఉన్నదని విమర్శించారు. మల్లన్నసాగర్ రైతుల పక్షాన రెండు రోజులు దొంగ దీక్షలు చేసి.. అధికారంలోకి వస్తే పరిహారం డబుల్ ఇస్తామని చెప్పి ఇప్పుడు ఆ గ్రామాల వైపు చూసిన దాఖలాలు లేవని మండిపడ్డారు. పెండింగ్‌లో ఉన్న ఐదు–పదిశాతం బకాయిలను చెల్లించకుండా ఎట్లా హైదరాబాద్‌కు నీళ్లను తీసుకుపోతావో చూస్తామని హెచ్చరించారు. 'కన్నెపల్లిలో కట్క ఒత్తితే రైతులకు నీళ్లు కనిపిస్తాయి.. కేసీఆర్ గుర్తుకొస్తాడు, పండించిన పంటలకు కొనాల్సి వస్తది. యూరియా ఇవ్వాల్సి వస్తది' అని భయపడి రేవంత్‌రెడ్డి రైతులకు నీళ్లియ్యకుండా ద్రోహం చేస్తున్నాడని విమర్శించారు. రాష్ట్రం లో కల్యాణలక్ష్మి చెక్కుల కోసం రెండు లక్షల మంది ఎదురుచూస్తున్నారని తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు మైనారిటీల బడ్జెట్ రూ.300 కోట్లు ఉంటే కేసీఆర్ దానికి రూ.1,800 కోట్లకు తీసుకొస్తే రేవంత్‌రెడ్డి మాత్రం తగ్గించి రూ.1,300 కోట్లకు తెచ్చారని దుయ్యబట్టారు. అధికారంలోకి వస్తే రూ.4 వేల కోట్ల బడ్జెట్ ఇస్తామంటూ అబద్ధాలు పలికారని ధ్వజమెత్తారు. తుర్కకాశీ, మైనారిటీ ముస్లింలకు కార్పొరేషన్‌లో ఉన్న రూపాయి కూడా లబ్ధి చేకూరడం లేదని విమర్శించారు. మూడేండ్లలో అన్ని వర్గాలకు మోసం చేసిన ఘనత కాంగ్రెస్‌కు దక్కుతుందని అన్నారు. మూడేండ్లలో మైనారిటీలకు కాంగ్రెస్ ఇచ్చింది రూ.14 కోట్లు మాత్రమేనని స్పష్టం చేశారు. మైనారిటీ కార్పొరేషన్‌లో ఏడు నెలలుగా జీతాలు లేవని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ వీ యాదవరెడ్డి, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఫారూక్ హుస్సేన్, ఎంఎస్ శ్రీనివాస్, బడే సాహెబ్ లు పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ కుమార్తెకు ఎమ్మెల్సీ పదవి?

మొదటిపేజీ తరువాయి.. తెలంగాణలో త్వరలో ఖాళీ కానున్న గవర్నర్ కోటా ఎమ్మెల్సీ స్థానాల భర్తీపై కాంగ్రెస్ పార్టీ కసరత్తు ముమ్మరం చేసింది. తెలంగాణ ఉద్యమ పితామహుల్లో ఒకరైన కొండా లక్ష్మణ్ బాపూజీ కుమార్తె పవిత్రవాణి పేరును ఓ స్థానానికి పరిశీలిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలుస్తోంది. పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన ఆమె, ప్రస్తుతం వైద్యవృత్తిలో ఉన్నారు. సిరిసిల్ల సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ఒక ఎమ్మెల్సీ సీటును పద్మశాలి వర్గానికి కేటాయిస్తామని ప్రకటించిన నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం 1969 ఉద్యమ సమయంలో మంత్రి పదవికి రాజీనామా చేసిన తొలి నేతగా కొండా లక్ష్మణ్ బాపూజీ చరిత్రలో నిలిచారు. అయితే, రాష్ట్రం ఏర్పడ్డాక ఉద్యమకారుల కుటుంబాలను గత బీఆర్ఎస్ ప్రభుత్వం విస్మరించిందని రేవంత్ రెడ్డి ప్రతిపక్ష నేతగా ఉన్నప్పటి నుంచీ ఆరోపిస్తున్నారు. సీఎం అయ్యాక ఆ దిశగా చర్యలు చేపట్టారు. ప్రొఫెసర్ కోదండరామ్‌ను ఎమ్మెల్సీగా, శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మ, చాకలి ఐలమ్మ మనుమరాలిని మహిళా కమిషన్ సభ్యులుగా నియమించారు. ఈ క్రమంలోనే తాజాగా బాపూజీ కుమార్తెకు అవకాశం ఇవ్వాలనే ప్రతిపాదన వచ్చినట్లు సమాచారం. నవంబర్ 14న ఎమ్మెల్సీలు గోరటి వెంకన్న, బస్వరాజు సారయ్య, బొగ్గారపు దయానంద్‌ల పదవీకాలం ముగియనుంది. ఈ మూడు స్థానాల్లో ఒకదాన్ని పద్మశాలి వర్గానికి కేటాయించనున్నారు. పవిత్రవాణిని ఎంపిక చేయడం ద్వారా ఉద్యమ కుటుంబానికి గౌరవం కల్పించడంతో పాటు, బీసీలు, మహిళల్లో పార్టీకి సానుకూల వాతావరణం ఏర్పడుతుందని కాంగ్రెస్ అధిష్ఠానం భావిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే, ఇదే సీటు కోసం పార్టీలోని ఇతర పద్మశాలి నేతలు కూడా గట్టిగా ప్రయత్నిస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్, నల్గొండ డీసీసీ అధ్యక్షుడు కైలాష్ నేత వంటి వారి పేర్లు కూడా చర్చల్లో ఉన్నాయి. అన్ని సమీకరణాలను బేరీజు వేసుకుని సీఎం రేవంత్ రెడ్డి, పార్టీ హైకమాండ్ తుది నిర్ణయం తీసుకోనుంది.

TGTEL/26/A7716
ఉద్యమ పోరు
ప్రతి పదం పోరాట కదం
సోమవారం 05.10.2026

పెద్ది స్వప్నను మర్యాదపూర్వకంగా కలిసిన రెడ్ క్రాస్ ప్రతినిధులు

ఉద్యమపోరు, నర్సంపేట, అక్టోబర్ 4: వరంగల్ జిల్లా BRS పార్టీ మాజీ జడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న సుదర్శన్ రెడ్డి గారిని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర MC మెంబర్ నాడెం శాంతి కుమార్, వైస్ చైర్మన్ శానబోయిన రాజ్ కుమార్, జిల్లా MC మెంబర్ మోతె తిరుపతి రెడ్డి జిల్లా MC మెంబర్ డాక్టర్ లెక్కల విద్యాసాగర్ రెడ్డి గార్లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి పెద్ది స్వప్న సుదర్శన్ రెడ్డి గారు హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ఈ భేటీ సందర్భంగా రెడ్ క్రాస్ సొసైటీ చేస్తున్న విశిష్ట సేవలను పెద్ది స్వప్న సుదర్శన్ రెడ్డి గారు గుర్తు చేసుకున్నారు. విపత్తుల సమయంలో బాధితులను ఆదుకోవడంలో, అత్యవసర సమయాల్లో రక్తదాన శిబిరాల ద్వారా ప్రాణాలను కాపాడటంలో, అలాగే ఉచిత వైద్య సేవలు మరియు ప్రథమ చికిత్సపై ప్రజల్లో అవగాహన పెంచడంలో రెడ్ క్రాస్ సొసైటీ ఎనలేని సేవలందిస్తోందని కొనియాడారు. భవిష్యత్తులోనూ మరిన్ని విస్తృత సేవా కార్యక్రమాలు చేపట్టి పేదలకు అండగా నిలవాలని సూచించారు.ప్రతినిధులంతా సమష్టిగా కృషి చేసి రెడ్ క్రాస్ సంస్థను రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో అత్యున్నత స్థానానికి చేర్చాలని, వీరి విశిష్ట సేవల ద్వారా నర్సంపేట ప్రాంతానికి మరింత మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని పెద్ది స్వప్న సుదర్శన్ రెడ్డి గారు మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు.

ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా 'లీడ్ బెస్ట్ టీచర్ అవార్డ్స్–2026'

ఉద్యమపోరు, నర్సంపేట, అక్టోబర్ 4: ఉపాధ్యాయుల అంకిత భావాన్ని, సేవా స్ఫూర్తిని, వినూత్న బోధనా విధానాలను గుర్తించి వారిని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో లీడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'లీడ్ బెస్ట్ టీచర్ అవార్డ్స్–2026' కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని అక్టోబర్ 5న నర్సంపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో విద్యారంగంలో విశేష సేవలందిస్తున్న ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించనున్నారు. కేవలం పాఠాలు బోధించడమే కాకుండా విద్యార్థుల్లో విలువలు, ఆత్మవిశ్వాసం, సృజనాత్మకత, సామాజిక బాధ్యతలను పెంపొందిస్తూ భవిష్యత్ తరాలను తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయుల సేవలను గుర్తించి గౌరవించాలనే ఆలోచనతో ఈ అవార్డులను అందిస్తున్నట్లు కాసుల రవికుమార్, శోభారాణి పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి నర్సంపేట ఎమ్మెల్యే శ్రీ దొంతి మాధవరెడ్డి గారు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఉపాధ్యాయుల సేవలను గౌరవించే ఈ కార్యక్రమం ద్వారా మరింత మంది ఉపాధ్యాయుల్లో సేవా స్ఫూర్తి, నూతన ఆలోచనలు, ఉత్తమ బోధనా పద్ధతుల పట్ల ఆసక్తి పెంపొందుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

తూకాల్లో మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు

- జిల్లా లీగల్ మెట్రోలజీ అధికారి వరంగల్ కె. మనోహర్

- **నర్సంపేటలో 15 మంది వ్యాపారులపై కేసులు నమోదు**

ఉద్యమపోరు, నర్సంపేట, అక్టోబర్ 4: తూనికలు, కొలతల విషయంలో నిబంధనలు ఉల్లంఘించే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని వరంగల్ జిల్లా లీగల్ మెట్రోలజీ అధికారి కె. మనోహర్ హెచ్చరించారు. ఆదివారం నర్సంపేట పట్టణంలోని చేపలు, చికెన్, మాంసం, పండ్ల దుకాణాల్లో ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా తూనికలు, కొలతల పరికరాలకు సకాలంలో ధ్రువీకరణ చేయించుకోకుండా, శాఖ ముద్రలు వేయించుకోకుండా వినియోగిస్తున్న 15 మంది వ్యాపారులపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.వ్యాపారులందరూ తమ తూకపు యంత్రాలు, ఇతర కొలతల పరికరాలను నిర్ణీత గడువులోగా తనిఖీ చేయించి అధికారిక ముద్రలు వేయించుకోవాలని సూచిం చారు. వినియోగదారులకు సరైన తూకంతో సరుకులు అందించాలని, తూకాల్లో మోసాలకు పాల్పడితే తూనికలు, కొలతల చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వినియోగదారులు వస్తువులు కొనుగోలు సందర్భంగా తూకాలను పరిశీలించాలని సూచించారు.

భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లో మూడో యూనిట్ నిలిచిపోవడం ప్రభుత్వ వైఫల్యమే : మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్

ఉద్యమపోరు, ఖమ్మం, అక్టోబర్ 04 : భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లోని మూడో యూనిట్‌లో విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోవడంపై మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ డిమాండ్ పెరుగుతున్న సమయంలో కీలకమైన యూనిట్ నిలిచిపోవడం ప్రభుత్వ విద్యుత్ నిర్వహణలో నిర్లక్ష్యానికి, వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు.ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఈ యూనిట్ నిలిచిపోవడంతో రోజుకు 270 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి అంతరాయం కలిగిందని ఇప్పటివరకు సుమారు 15.5 కోట్ల యూనిట్ల విద్యుత్ ఉత్పత్తికి ఆటంకం కలిగిందని మాజీ మంత్రి పువ్వాడ ఆందోళన వ్యక్తంచేశారు. విద్యుత్ ఉత్పత్తి సంస్థల్లో కీలకమైన పరికరాల నిర్వహణ, ముందస్తు తనిఖీలు, స్పేర్ పార్ట్స్ అందుబాటులో ఉంచడంలో ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యం వహించిం దో సమాధానం చెప్పాలని పువ్వాడ డిమాండ్ చేశారు. నిలిచిపోయిన మూడో యూనిట్‌ను వెంటనే పునరుద్ధరించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలేమిటో వెల్లడించాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ప్రశ్నించారు.

ఘనంగా కామారెడ్డి సహారా బాధితుల సంక్షేమ సంఘం ఎన్నిక

ఉద్యమపోరు, నిజామాబాద్ రూరల్ ధర్పల్లి, అక్టోబర్ 4 : కామారెడ్డి స్థానిక గాంధీనగర్ ఆర్య వైశ్య భవనంలో తెలంగాణ సహారా బాధితుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వడ్ల బాలయ్య మరియు ముఖ్య సలహాదారు వేలుపుల బాలరాజు ఆధ్వర్యంలో కామారెడ్డి సహారా బాధితుల సంక్షేమ సంఘాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. సంఘం పదవులకు ఎన్నికైన వారు అధ్యక్షులు: తృప్తి అనిల్ప్రధాన కార్యదర్శి: వెన్ను పూర్ణచందర్కోషాధికారి: అంకం బాలరాజ్ఉపాధ్యక్షులు: ఈ అశోక్, చింతల రాజేష్, వంగల తులసిదాస్మహిళా అధ్యక్షులు: విజయసహాయ కార్యదర్శులు: ఎం సత్యనారాయణ, మాధవ రెడ్డి, పబ్బ కిరణ్, రాజలింగంఆర్గనైజింగ్ సెక్రెటరీ: ఏ అశోక్కార్యవర్గ సభ్యులు: కొండ భూమయ్య, సిద్ధా గౌడ్ వడ్ల బాలయ్య మాట్లాడుతూ దేశంలోని 13 కోట్ల ఖాతాదారులు మరియు 12 లక్షల కార్యకర్తల సహారా కో ఆపరేటివ్ సంస్థ లో చిక్కుకుపోయిన తమ పెట్టుబడులను రాబట్టడం కోసం మన ఉద్యమాన్ని ఉధృతం చేయవలసిన అవసరం ఆసన్నమైందని అందుకే ప్రతి ఒక్కరు ఉద్యమం పాల్గొని తమ సమస్యలకు పరిష్కారం వచ్చేవరకు మన పోరాటం కొనసాగించాలి అని పిలుపునిచ్చారు అదేవిధంగా సంఘ రాష్ట్ర ముఖ్య సలహా దారులు వేల్పుల బాలరాజు కేంద్ర ప్రభుత్వం వెంటనే సహారా ఆస్తులను జప్తు చేసి ఖాతాదారులకు సత్వరమే చెల్లింపులు చేయాలని సుప్రీం కోర్టు లో సహారా తీర్పుల విచారణ వేగవంతం చేసి ఖాతాదారులకు న్యాయం జరిగే విధంగా వెంటనే తీర్పులు ఇవ్వాలని కోరారు

వ్యాపార రంగంలో యువత రాణించాలి : గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి

- **మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి : సర్పంచ్ కరుణాకర్ రెడ్డి**
- **దసరా, దీపావళి పండుగలకు ప్రత్యేక ఆఫర్లు : ప్రొప్రైటర్ వినయ్ రెడ్డి**

ఉద్యమపోరు, గజ్వేల్, అక్టోబర్ 04 : యువత కేవలం ఉద్యోగాల వెంటే పడకుండా, స్వయం ఉపాధితో వ్యాపార రంగంలోకి అడుగుపెట్టి రాణించాలని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి పిలుపునిచ్చారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన 'ఎస్ వి ఫ్యాషన్ డ్రెస్సెస్ మరియు సారీ షాప్' ప్రారంభోత్సవ కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ దుకాణాన్ని ఖమ్మంపల్లి సర్పంచ్ కరుణాకర్ రెడ్డి ప్రారంభించగా, ఎమ్మెల్యే నర్సారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మరియు సర్పంచ్ మాట్లాడుతూ రాబోయే దసరా, దీపావళి పండుగలను పురస్కరించుకుని వినియోగదారుల కోసం ఈ షాపులో ప్రత్యేక ఆఫర్లు కల్పిస్తుండటం అభినందనీయమన్నారు. మహిళలకు కావలసిన సరికొత్త ఫ్యాషన్ చీరలు, పంజాబీ డ్రెస్సులు, కుర్తా పైజామాలు వంటి ఆధునిక వస్త్రాలు ఇక్కడ సరసమైన ధరలకే లభిస్తాయని పేర్కొన్నారు. గజ్వేల్ పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, మహిళలు ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

కార్యకర్త కుటుంబాన్ని తల్లోజు ఆచారి పరామర్శ

ఉద్యమపోరు, తలకొండపల్లి, అక్టోబర్ 4 : తలకొండపల్లి మండల పరిధిలోని వెల్జాల్ గ్రామానికి చెందిన రంగారెడ్డి జిల్లా మైనారిటీ సెల్ మాజీ అధ్యక్షుడు సదక్ అలీని జాతీయ ఓబీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి ఆదివారం పరామర్శించారు. ఇటీవల సదక్ అలీ తల్లి మరణించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో వెల్జాల్ గ్రామంలోని వారి నివాసానికి చేరుకున్న తల్లోజు ఆచారి, సదక్ అలీ కుటుంబ సభ్యులను కలిసి వారిని ఓదార్చారు.మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ, కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.కార్యకర్తలతో భేటీ పరామర్శ అనంతరం తల్లోజు ఆచారి స్థానిక పార్టీ కార్యకర్తలతో సమావేశమై మాట్లాడారు.మండలంలో పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు నీలకంఠం పాండు, గట్టు ఇప్పలపల్లి సర్పంచ్ జీనుకుంట్ల చంద్రశేఖర్, దళిత మోర్చా జిల్లా వైస్ ప్రెసిడెంట్ రాజు, బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ పద్మ అనిల్ సీనియర్ నాయకులు సుదర్శన్ రెడ్డి, వెంకటయ్య, బాలకృష్ణ, ఆరిఫ్,శ్రీశైలం,గణేష్,నర్సింహా,హరికాంత్, రాఘవేంద్రర్ గౌడ్, నాయక్, రవి తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణుల ఉనికి ప్రశ్నార్థకమైతే..
మన భవిష్యత్తే ప్రశ్నార్థకం!

ఉద్యమపోరు, స్పెషల్ స్టోరీ : 1999లో నేను పదో తరగతి చదువుతున్న రోజుల్లో వన్యప్రాణి వారోత్సవాల సందర్భంగా అటవీ శాఖ వారు నిర్వహించిన వ్యాసరచన, క్విజ్ పోటీల్లో మొదటి బహుమతులు సాధించాను. బహుమతులు అందించేందుకు అటవీ శాఖ వారు వాహనం పంపించి మమ్మల్ని వరంగల్‌కు తీసుకెళ్లారు. అక్కడ అందుకున్న ఆ బహుమతులు నాకు ఎంతో ఆనందాన్ని ఇచ్చాయి. కానీ ఆ రోజు నా చేతికి వచ్చిన బహుమతి కంటే, నా మనసులో నాటుకున్న వన్యప్రాణి సంరక్షణ పట్ల ఆసక్తి, ప్రకృతి పట్ల బాధ్యత నాకు ఎంతో విలువైనవిగా మారాయి.అప్పటి నుంచి వన్యప్రాణులు, అడవులు, పర్యావరణం గురించి ఆలోచించడం నా జీవితంలో ఒక భాగమైంది. ముఖ్యంగా నర్సంపేటకు సమీపంలోని పాఖాల ప్రకృతి రమణీయత నా ప్రకృతి ప్రేమను మరింత పెంచింది. పచ్చని అడవులు, జలాశయం, పక్షుల కిలకిలరావాలు, వివిధ రకాల జీవజాలం... ఇవన్నీ మనిషి ప్రకృతిలో ఒక భాగమే తప్ప ప్రకృతికి యజమాని కాదనే విషయాన్ని నాకు పదేపదే గుర్తుచేస్తాయి.

వన్యప్రాణులు... ప్రకృతి గొలుసులో కీలకం

వన్యప్రాణుల సంరక్షణ అంటే కేవలం పులులను, ఏనుగులను, జింకలను కాపాడటం కాదు. ప్రకృతిలోని ప్రతి జీవికి జీవించే హక్కును కల్పించడం. చిన్న పురుగు నుంచి పెద్ద ఏనుగు వరకు ప్రతి జీవి పర్యావరణ వ్యవస్థలో తనదైన పాత్రను పోషిస్తుంది. ఒక జీవజాతి అంతరించిపోతే దాని ప్రభావం మరెన్నో జీవులపై పడుతుంది. చివరికి ఆ ప్రభావం మనిషి జీవితాన్నీ తాకుతుంది.అందుకే వన్యప్రాణులను కాపాడటం అంటే మన పర్యావరణ వ్యవస్థను కాపాడటం. అడవులను కాపాడటం, నీటి వనరులను సంరక్షించడం, జీవ వైవిధ్యాన్ని పరిరక్షించడం, వన్యప్రాణుల సహజ ఆవాసాలను రక్షించడం——ఇవన్నీ వన్యప్రాణి సంరక్షణలో అంతర్భాగాలే.

2026 థీమ్:

ఆవాసాల అనుసంధానం, వన్యప్రానుల వికాసం

72వ వన్యప్రాణి వారోత్సవాలకు "Connecting Habitats, Thriving Wildlife" అనే థీమ్‌ను ప్రాధాన్యంగా తీసుకున్నారు. అంటే వన్యప్రాణుల ఆవాసాల అనుసంధానం, వన్యప్రాణుల సంచార మార్గాలు కూడా సురక్షితంగా ఉండాలి. ఈ దృక్పథం రక్షిత అటవీ ప్రాంతాల సరిహద్దులను దాటి, మొత్తం ప్రకృతి దృశ్యాన్ని ఒక జీవ వ్యవస్థగా చూడాలని సూచిస్తోంది. ఒక అడవి మధ్యలో రహదారులు, రైల్వే మార్గాలు, నిర్మాణాలు పెరిగి వన్యప్రాణుల సహజ సంచార మార్గాలను అడ్డుకుంటే, వాటి జీవన విధానం దెబ్బతింటుంది. కొన్నిసార్లు అదే మానవ–వన్యప్రాణి సంఘర్షణకు కారణమవుతుంది. అందుకే భవిష్యత్తు కార్యాచరణలో వన్యప్రాణి సంరక్షణలో ఆవాసాల రక్షణతో పాటు వాటి అనుసంధానాన్ని కాపాడటం కావాలి.

మన అభివృద్ధి...

వాటి ఉనికికి ముప్పుగా మారకూడదు

అభివృద్ధి అవసరం. రహదారులు కావాలి, పరిశ్రమలు కావాలి, పట్టణాలు విస్తరించాలి. కానీ అభివృద్ధి ప్రకృతిని పూర్తిగా పక్కన పెట్టినప్పుడు సమస్య మొదలవుతుంది. అడవుల నరికివేత, అక్రమ వేట, ఆవాసాల ఆక్రమణ, కాలుష్యం, ప్లాస్టిక్ వ్యర్థాలు, వాతావరణ మార్పులు వన్యప్రాణులపై తీవ్రమైన ప్రభావం చూపుతున్నాయి.అందుకే మనం "ప్రకృతికి వ్యతిరేకంగా అభివృద్ధి" నుంచి "ప్రకృతితో కలిసి అభివృద్ధి" వైపు అడుగులు వేయాలి. వన్యప్రాణుల ఆవాసాలను కాపాడుతూ, వాటి సంచార మార్గాలను రక్షిస్తూ, స్థానిక సమాజాల భాగస్వామ్యంతో సంరక్షణ కార్యక్రమాలు కొనసాగించాలి.

వన్యప్రాణి సంరక్షణలో విద్యార్థుల పాత్ర

వన్యప్రాణి సంరక్షణకు చట్టాలు, అటవీ శాఖ చర్యలు, సంరక్షిత ప్రాంతాలు ఎంత అవసరమో, ప్రజల్లో అవగాహన కూడా అంతే అవసరం. ముఖ్యంగా విద్యార్థుల్లో చిన్న వయసులోనే ప్రకృతి పట్ల ప్రేమ, జీవుల పట్ల గౌరవం, పర్యావరణ బాధ్యత పెంపొందించాలి.వ్యాసరచన, క్విజ్, చిత్రలేఖనం, ప్రసంగాలు, ప్రకృతి సందర్శనలు, మొక్కల పెంపకం వంటి కార్యక్రమాలు పిల్లల్లో ఆలోచనను రేకెత్తిస్తాయి. నేను విద్యార్థిగా 1999లో ఒక వన్యప్రాణి వారోత్సవంలో పాల్గొని పొందిన అనుభవమే ఇందుకు నాకు ప్రత్యక్ష ఉదాహరణ.నా విద్యార్థి దశలో ఏర్పడిన ఆలోచన కాలక్రమేణా ఒక బాధ్యతగా మారింది. గత రెండు దశాబ్దాలుగా లీడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో పర్యావరణ పరిరక్షణకు ప్రధాన స్థానం కల్పిస్తున్నాం. విద్యార్థుల్లో మొక్కల పెంపకం, ప్రకృతి పట్ల ప్రేమ, నీటి సంరక్షణ, పరిశుభ్రత, జీవవైవిధ్యం, పర్యావరణ బాధ్యత వంటి అంశాలతో పాటు వన్యప్రాణుల సంరక్షణ పట్ల సున్నితమైన దృక్పథాన్ని పెంపొందించే ప్రయత్నం చేస్తున్నాం.నా దృష్టిలో విద్య అంటే కేవలం పరీక్షల్లో మార్కులు సాధించడం కాదు. మన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని అర్థం చేసుకోవడం, దాని పట్ల బాధ్యత వహించడం కూడా విద్యలో భాగమే. ఒక విద్యార్థి ఒక పక్షికి నీళ్లు పెట్టినా, ఒక మొక్కను కాపాడినా, ఒక వన్యప్రాణి పట్ల గౌరవంతో స్పందించినా——అది ప్రకృతి విద్యలో ఒక విజయమే.

వన్యప్రాణులకు మనం ఇవ్వాల్సిన హామీ

వన్యప్రాణులు మన సంరక్షణ కోసం మన దగ్గరకు వచ్చినవి కావు. అవి మనిషి రాకకు ముందే ఈ భూమిపై తమదైన జీవన ప్రపంచాన్ని నిర్మించుకున్నాయి. మన అభివృద్ధి కారణంగా వాటి ఆవాసాలను కోల్పోయినప్పుడు, వాటిని కాపాడాల్సిన బాధ్యత కూడా మనదే.అందుకే ఈ వన్యప్రాణి వారోత్సవం సందర్భంగా మనం ఒక ప్రశ్న వేసుకోవాలి: "వన్యప్రాణులను మనం కాపాడుతున్నామా? లేక వాటి జీవించే స్థలాన్ని మనమే క్రమంగా తగ్గిస్తున్నామా?"

ఈ ప్రశ్నకు మన చర్యలే సమాధానం కావాలి.

వన్యప్రాణి సంరక్షణ అంటే వాటి కోసం మాత్రమే కాదు——మన కోసం కూడా. వన్యప్రాణులు సురక్షితంగా ఉన్న అడవులే సురక్షితమైన భవిష్యత్తుకు పునాది.ప్రకృతి బతికితేనే మనం బతుకుతాం! ఈ విషయం యొక్క సీరియస్ నెస్ ని ప్రతి ఒక్కరూ అర్థం చేసుకున్ననాడే ఈ వారోత్సవాలకి ఒక సార్థకత చేకూరుతుంది.

కాసుల రవికుమార్
ప్రముఖ కవి, ఉపాధ్యాయుడు,
పర్యావరణ కార్యకర్త,
లీడ్ గ్రామీణ గ్రంథాలయాల వ్యవస్థాపకుడు.

మాజీ హోంశాఖ మంత్రి పట్లోళ్ల ఇంద్రారెడ్డి 72వ జయంతి వేడుకలు

- స్వర్గీయ మాజీహోంశాఖ మంత్రి ఇంద్రారెడ్డి సేవలు మరువ లేనిది
- మంచాల వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ వెదిరె హన్మంత్ రెడ్డి.
- కాంగ్రెస్ పార్టీ నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి
- ముచ్చర్ల వెంకటేష్ యాదవ్

ఉద్యమపోరు, ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 04 : మంచాల మండలం స్వర్గీయ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమాజీ హోంశాఖ మంత్రిపట్లోళ్ల ఇంద్రారె డ్డి జయంతి సందర్భంగా ఆరుట్ల గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇంద్రారెడ్డి విగ్రహానికిపూ లమాలలు వేసి నివాళులర్పించారు.ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంచాల వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ వెదిరె హన్మంత్ రెడ్డి హాజరైన కాంగ్రెస్ పార్టీ ఇబ్రహీంపట్నం నియోజకవ ర్గంనాయకుడు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి జిల్లా నాయకుడు ముచ్చర్ల వెంకటేష్ యాదవ్ ఈ సంద ర్భంగా నాయకులు మాట్లాడుతూ,స్వర్గీయ మాజీ హోంశాఖ మంత్రి పట్లోళ్ల ఇంద్రారెడ్డి విద్యార్థి స్థాయి నుండే ఎన్నో ఉద్యమాలు చేస్తూ ప్రజలకు అండగా ఉంటూ ప్రజాల సమస్యలపై పోరా టంచేస్తూ రాజకీయంగా హోంశాఖ మంత్రి స్థాయి ఎదిగి ప్రజలకు ఎన్నోసేవలు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన గొప్పనాయకుడు పట్లోళ్ల ఇంద్రారెడ్డి అని అన్నారు. ఇంద్రారెడ్డి చేసిన సేవలు మరువలేనివి అని అన్నారు. ఈకార్యక్రమంలో గ్రామపంచాయతీ వార్డు సభ్యుడు మహమ్మద్ ఇమ్రాన్ ఖాన్ ఇందిరమ్మకమిటీ సభ్యులు చెరుకు నరసింహగౌడ్ బుట్టి కృష్ణ ముది రాజ్ మార లక్ష్మణ్ మాజీసర్పంచ్ అనంగళ్ళ యాదయ్య కాంగ్రెస్ పార్టీ మండలం నాయకుడు రావుల భాష కాంగ్రెస్ పార్టీ నాయకులు గుడ్డిమల్ల చంద్రయ్య ముదిరాజ్ కావలి శ్రీనివాస్ ముది రాజ్ నూకం సత్తయ్య ముదిరాజ్ అంతటి రాజుగౌడ్ మెగావత్ లక్ష్మణ్ నాయక్ దాసరమోని రమేష్ ముదిరాజ్ కావలి రమేష్ ముదిరాజ్ మర సురేష్ ఉదరీ నరసింహ మహమ్మద్ యూసు ఫ్ మద్దెల గోపాల్ గౌడ్ మంకు శ్రీనివాస్ మహమ్మద్ ఇబ్రహీం సుంకరి దానయ్యగౌడ్ దాసరమోని అశోక్ ముదిరాజ్ మహమ్మద్ అశ్రప్ రావుల నాగరాజు రైనా ముదిరాజ్ దూసరి రాజుగౌడ్ గొరిగే కృష్ణ దండే వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు నాణ్యతతో వేగంగా పూర్తి చేయాలి : అర్థ సుధాకర్ రెడ్డి

ఉద్యమపోరు, వికారాబాద్, అక్టోబర్ 04 : వికారాబాద్: ప్రజలకు మౌలిక సదుపాయాలు మెరుగుపరచడమే లక్ష్యంగా అభివృద్ధి పనులను చేపడుతున్నామని మున్సిపల్ వైస్ చైర్మన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు అర్థ సుధాకర్‌రెడ్డి తెలిపారు. వికారాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని అనంతగిరిపల్లి వార్డులో కొనసాగుతున్న సీసీ రోడ్డు, మురుగు కాలువల నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ వేగంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. నిర్మాణ పనుల కారణంగా స్థానిక ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు . ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. తెలంగాణ శాసనసభాపతి , వికారాబాద్ శాసనసభ్యుడు గడ్డం ప్రసాద్‌కుమార్, వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం అనన్య సహకారంతో పట్టణంలో అభివృద్ధి పనులను మరింత ముందుకు తీసుకెళ్లడమే తమ లక్ష్యమని అర్థ సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు.

TGTEL/26/A7716
ఉద్యమ పోరు
ప్రతి పదం పోరాట కదం
సోమవారం 05.10.2026

మహిళా పారిశ్రామికవేత్తలకు అండగా నిలుస్తాం

- అవగాహన సదస్సులు.. బ్యాంకు రుణాల కోసం కృషి: ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

ఉద్యమపోరు, మల్కాజిగిరి, అక్టోబరు 4 : మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించడంతో పాటు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు ప్రత్యేకంగా కృషి చేస్తామని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. గౌతమ్‌నగర్ డివిజన్ ఉత్తమ్‌నగర్‌లోని వివేకానంద ఉన్నత పాఠశాలలో ఆచార్య ఎంపవరింగ్ ఉమెన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన 'వీ శక్తి మహిళా పారిశ్రామికవేత్తల వ్యాపార ప్రదర్శన–2026' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మహిళా పారిశ్రామికవేత్తలు ఏర్పాటు చేసిన వివిధ ప్రదర్శన శాలలను ఎమ్మెల్యే సందర్శించి, వారు తయారు చేస్తున్న ఉత్పత్తులను పరిశీలించారు. మహిళలు తమ వ్యాపారాలను మరింత విస్తరించేందుకు ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.చిన్న, మధ్య తరహా పరిశ్రమల పథకాలు, నమోదు ప్రక్రియ, ప్రభుత్వ ప్రోత్సాహకాలు, వ్యాపార నిర్వహణ, విక్రయాల విస్తరణ తదితర అంశాలపై మహిళలకు అవగాహన కల్పించే సదస్సులు నిర్వహించేందుకు కృషి చేస్తానని చెప్పారు. బ్యాంకుల ద్వారా అవసరమైన రుణాలు అందేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేస్తానని హామీ ఇచ్చారు.మహిళలు తయారు చేస్తున్న నాణ్యమైన ఉత్పత్తులకు తగిన మార్కెట్ సదుపాయాలు, ఆర్థిక సహకారం అందితే వారు మరింత అభివృద్ధి సాధించడంతో పాటు ఇతరులకు ఉపాధి అవకాశాలు కల్పించగలరని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మహిళా సాధికారత, స్వయం ఉపాధి, చిన్నతరహా పరిశ్రమల అభివృద్ధికి తన పూర్తి సహకారం ఉంటుందని తెలిపారు.కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మేకల సునీత, రాము యాదవ్, రఘురామ శర్మ, సూర్యకుమారి, శిరీష, హిమబిందు, పర్వతవర్ధిని, సుబ్రహ్మణ్యం, శాస్త్రి, కావూరి శ్రీనివాసరావు, రమణాచార్యులు, నంద ప్రసాద్ తదితర స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా పారిశ్రామికవేత్తలు, నిర్వాహకులు, ప్రదర్శన శాలల ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

కరాటే మాస్టర్ చింతల జగదీష్ మృతి.. పరామర్శించిన గోలి శ్రీనివాస్ రెడ్డి

ఉద్యమపోరు, ఆమన్గల్, అక్టోబర్ 4 : ఆమన్గల్ మున్సిపాలిటీ పరిధికి చెందిన ప్రముఖ కరాటే మాస్టర్ చింతల జగదీష్ ఇటీవల అనారోగ్యంతో కన్నుమూశారు. విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి, కల్వకుర్తి మాజీ మున్సిపల్ చైర్మన్ ఏడ్మ సత్యంలతో కలిసి ఆదివారం జగదీష్ నివాసానికి చేరుకుని ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు.అనంతరం జగదీష్ కుటుంబ సభ్యులను పరామర్శించి, వారిని ఓదార్చారు. ఈ సందర్భంగా గోలి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. జగదీష్ అకాల మృతి చెందడం ఎంతో బాధాకరమని, వారి కుటుంబానికి ఈ కష్ట సమయంలో మనోధైర్యం కల్పించాలన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ కుటుంబ సభ్యులకు తీవ్ర సంతాపం ప్రకటించారు. ఈ పరామర్శ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ స్థానిక నాయకులు, పలువురు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఏక్లాస్‌పూర్‌లో మద్యం విక్రయాలపై దాడులు

- గ్రామపంచాయతీ తీర్మానాన్ని ఉల్లంఘించారనే ఆరోపణలు

ఉద్యమపోరు, మంథని, అక్టోబర్ 04 : మంథని మండలం ఏక్లాస్‌పూర్ గ్రామంలో మద్యం విక్రయాలను నిషేధిస్తూ గ్రామపంచాయతీ పాలకవర్గం చేసిన తీర్మానాన్ని ఉల్లంఘించి మద్యం విక్రయాలు జరుగుతున్నాయనే ఆరోపణల నేపథ్యంలో మంగళవారం దాడులు నిర్వహించారు. గ్రామపంచాయతీ సభ్యులు పోలీసుల సహకారంతో ఆయా దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు.ఈ సందర్భంగా లభించిన మద్యాన్ని పోలీసు, ఎక్సైజ్ శాఖ అధికారులకు అప్పగించినట్లు గ్రామపంచాయతీ సభ్యులు తెలిపారు. గ్రామంలో మద్యం విక్రయాలను అరికట్టేందుకు చర్యలు కొనసాగిస్తామని పేర్కొన్నారు.

హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో 'మాదిగ విద్యార్థుల జాతీయ మహాసభ'ను విజయవంతం చేయండి....

- ఎమ్మార్పీఎస్ బోనకల్ మండల అధ్యక్షుడు మాగి ముఖేష్ మాదిగ పిలుపు...

ఉద్యమపోరు, బోనకల్, అక్టోబర్ 04 : హైదరాబాద్‌లోని ప్రతిష్టాత్మక ఉస్మానియా యూనివర్సిటీ వేదికగా అక్టోబర్ 6వ తేదీన నిర్వహించనున్న "మాదిగ విద్యార్థుల జాతీయ మహాసభ"ను అత్యంత ఘనంగా విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ బోనకల్ మండల అధ్యక్షుడు మాగి ముఖేష్ మాదిగ విజ్ఞప్తి చేశారు.మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ సుదీర్ఘ పోరాటాల ఫలితంగా ఎస్సీ రిజర్వేషన్ల ఏబీసీడీ వర్గీకరణ కల నెరవేరిందని గుర్తుచేశారు. ఈ చారిత్రాత్మక విజయంతో లభించిన రిజర్వేషన్ వర్గీకరణ ఫలాలను అందుకోవడంలో మాదిగ విద్యార్థులు ఎప్పుడూ ముందువరుసలో ఉండాలని ఆకాంక్షించారు.విద్యార్థుల భవిష్యత్తు, విద్యా అవకాశాలు, హక్కుల సాధనే ధ్యేయంగా ఈ జాతీయ మహాసభను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. బోనకల్ మండలంలోని ప్రతి గ్రామం నుండి విద్యార్థులు, యువకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అక్టోబర్ 6న ఉదయం 10:00 గంటలకు ఉస్మానియా యూనివర్సిటీలో జరగబోయే ఈ మహాసభను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

మున్నూరు కాపు సంఘం నూతన కార్యవర్గం నియామకం

ఉద్యమపోరు, నిజామాబాద్, అక్టోబర్ 04 : నిజామాబాద్ జిల్లా మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని నియమించినట్లు సంఘం జిల్లా అధ్యక్షులు,మాజీ మేయర్ ధర్మపురి సంజయ్ తెలిపారు.మున్నూరు కాపు సంఘం సమావేశంలో సంఘం అభివృద్ధి,సభ్యుల సంక్షేమం,సామాజిక సేవా కార్యక్రమాలపై చర్చించి పలువురిని వివిధ బాధ్యతల్లో నియమించినట్లు తెలిపారు.జిల్లా కార్యవర్గ సభ్యులుగా సుగంధం మురళి,సుగంధం సతీష్,అంగిరేకుల సాయిలు,సోమినేని రాజేందర్,బంటు సత్యజిత్,బంటు ప్రవీణ్ కుమార్,ముచ్కూర్ నవీన్ కుమార్,నాయక్ వాడ్ జగన్నాథ్,మల్కాయి సుదర్శన్,పెద్దగంటి లింబాద్రి స్వామి లను,మహిళా విభాగంలో లావణ్య,మెండి సునీత,చంద్రకళ లకు,యువజన విభాగంలో సూధం హరీష్,ఈర్ల శ్రీధర్,కౌడపు రణధీర్,ఉల్లెంగ నాగరాజ్ లను నియమించినట్లు తెలిపారు.మున్నూరు కాపు సంఘం బలోపేతానికి,సభ్యుల సంక్షేమానికి,సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణకు నూతన కార్యవర్గం కృషి చేయాలని జిల్లా మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు,మాజీ మేయర్ ధర్మపురి సంజయ్ ఆకాంక్షించారు.నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సభ్యులను పలువురు అభినందించారు.

వెల్జాల్ లో 'అబ్బాస్ ఫంక్షన్ హాల్' ఘన ప్రారంభం.. తరలివచ్చిన ప్రముఖులు, రాజకీయ నాయకులు

- కోలాహలంగా 'అబ్బాస్ ఫంక్షన్ హాల్' ప్రారంభోత్సవం.. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే కసిరెడ్డి, తల్లోజు ఆచారి... సుంకి రెడ్డి రాఘవేందర్ రెడ్డి

ఉద్యమపోరు, తలకొండపల్లి, సెప్టెంబర్ 4 : తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామంలో నూతనంగా నిర్మించిన అబ్బాస్ ఫంక్షన్ హాల్‌ను ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఎండి మహిమ్మద్, అబ్బాస్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి నియోజకవర్గ ప్రజాప్రతినిధులు,ప్రముఖులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఘనంగా ప్రారంభించిన ప్రముఖులుఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ జాతీయ ఓబీసీ కమిషన్ సభ్యుడు తల్లోజు ఆచారి, సింకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్ యాదవ్, స్థానిక సర్పంచ్ వానరాశి రాములమ్మ, పాలకవర్గం సభ్యులు, వివిధ గ్రామాల సర్పంచులు,తదితరులు ముఖ్య అతిథులుగా విచ్చేసి, అబ్బాస్ కుటుంబ సభ్యులతో కలిసి రిబ్బన్ కట్ చేసి ఫంక్షన్ హాల్‌ను సాంప్రదాయబద్ధంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... స్థానిక ప్రజలకు అందుబాటులో అత్యాధునిక వసతులతో ఫంక్షన్ హాల్‌ను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు.సందడిగా మారిన ప్రాంగణంఈ నూతన ఫంక్షన్ హాల్ ప్రారంభోత్సవానికి కేవలం తలకొండపల్లి గ్రామస్థులే కాకుండా చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, అన్ని రాజకీయ పార్టీల ముఖ్య నాయకులు, స్థానికులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఫంక్షన్ హాల్ ప్రాంగణమంతా పండుగ వాతావరణం, కోలాహలం నెలకొంది.నిర్వాహకుల ఘన సన్మానంకార్యక్రమానికి విచ్చేసిన ముఖ్య అతిథులను, ప్రజాప్రతినిధులను మరియు వివిధ పార్టీల నాయకులను ఫంక్షన్ హాల్ నిర్వాహకులు శాలువాలు కప్పి, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ కుటుంబ సభ్యులు గౌస్, అబ్బాస్‌లతో పాటు వివిధ పార్టీల శ్రేణులు, స్థానిక నాయకులు, కుటుంబ సభ్యులు మరియు గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.కాళ్ళ జంగయ్య ఆవుల యాదయ్య సీనియర్ నాయకులు మహమ్మద్ యూసుఫ్ ఆలీ పగడాల వెంకటేష్ ,నూకం రవి ,ముదిరాజ్ యస్ డి హఫీజ్ పాష తదితరులు పాల్గొన్నారు.

కల్కి డిజిటల్ ఫ్లెక్సీ ప్రింటింగ్ & బ్రాండింగ్ నూతన ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా బిఆర్ఎస్ రాష్ట్ర యువజన నాయకులు శివ ప్రకాష్

ఉద్యమపోరు, చైతన్యపురి, అక్టోబర్ 4 : చైతన్యపురి మారుతీ నగర్ కల్కి డిజిటల్ ఫ్లెక్సీ ప్రింటింగ్ & బ్రాండింగ్ నూతన ప్రారంభోత్సవ కార్యక్రమానికి బిఆర్ఎస్ రాష్ట్ర యువజన నాయకులు శివ ప్రకాష్, ఫణిగిరి కాలనీ వైస్ ప్రెసిడెంట్ లక్కీ గౌడ్, జిహెచ్ఎంసి యాదవ సంఘం అధ్యక్షుడు రవి యాదవ్, టీవీ నటుడు రాకేష్ ముఖ్య అతిథిగా హాజ ర య్యారు, నిర్వాహ కులు వంశీ కృష్ణ కీ తమ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా సదరు సంస్థ విజయవంతంగా అభివృద్ధి చెందాలని, నాణ్యమైన సేవలు అందిస్తూ మంచి పేరు సంపాదించాలని వారు ఆకాంక్షించారు.

24వ వార్డులో ఉచిత వైద్య శిబిరం

ఉద్యమపోరు, వికారాబాద్, అక్టోబర్ 04 : వికారాబాద్: వికారాబాద్ మున్సిపాలిటీ 24వ వార్డులో కౌన్సిలర్ చిట్యాల రుచిత సాయిచరణ్ రెడ్డి ఆధ్వర్యంలో అపోలో ఆస్పత్రులు, జస్టిస్ కొండ మాధవరెడ్డి ఫౌండేషన్ సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.శిబిరంలో సాధారణ వైద్యం, శస్త్రచికిత్స, కంటి, ఎముకల వైద్యం, స్త్రీ వైద్య విభాగాలకు చెందిన నిపుణులు పాల్గొని ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి వైద్య సలహాలు అందించారు. వార్డుకు చెందిన సుమారు 105 మంది శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారు.ప్రజలకు వైద్య సేవలను చేరువ చేయాలనే ఉద్దేశంతో శిబిరాన్ని నిర్వహించినట్లు కౌన్సిలర్ రుచిత సాయిచరణ్ రెడ్డి తెలిపారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు భవిష్యత్తులోనూ ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని పేర్కొన్నారు.

డాక్టరేట్ సాధించిన మౌనిక కు ఘన సన్మానం.

ఉద్యమపోరు, ఏన్కూరు, అక్టోబర్ 04 : కఠోర శ్రమ, పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చని నిరూపించిన జువ్వాది మౌనిక కాకతీయ యూనివర్సిటీలో డాక్టరేట్ పట్టాను సాధించిన విషయం తెలిసిందే... విద్యారంగంలో ఏన్కూరు ఆడబిడ్డకు అరుదైన గౌరవం దక్కింది. మౌనిక డాక్టరేట్ అందుకున్న విషయం తెలుసుకున్న బి ఆర్ఎస్ పార్టీ వైరా నియోజకవర్గ నాయకురాలు బానోత్ మనీషా లక్ష్మి మదన్ లాల్ మౌనిక నివాసానికి వెళ్లి శాలువ తో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మనీషా లక్ష్మి మాట్లాడుతూ.... నేటి సమాజంలో మహిళలు అన్నిరంగాల్లో ముందంజలో ఉంటున్నారని ఎన్నో సవాళ ను ఎదుర్కొని విద్యారంగంలో అత్యున్నత డాక్టరేట్ ను సాధించటం తల్లిదండ్రులకు, ఈ ప్రాంతానికి గర్వకారణం అని ఆమె ప్రశంసించారు. ఈనాటి యువతల కు ఆమె ఒక రోల్ మోడల్ అని పేర్కొన్నారు. పలువురు బిఆర్ఎస్ పార్టీ నాయకులు మౌనిక ను అభినందించారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ఎస్ పార్టీ నాయకులు రైలు ,బుల్లయ్య, తల్లిదండ్రులు శివయ్య–పద్మ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ గోవు మాంసం విక్రయంపై అధికారుల దాడి.

ఉద్యమపోరు, భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 04 : గోవు మాంసాన్ని అక్రమంగా విక్రయిస్తున్నారన్న సమాచారంతో రెవెన్యూ, పోలీసు అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ఆదివారం దుమ్ముగూడెం మండలం నర్సాపూర్ గ్రామంలో చేపట్టిన తనిఖీల్లో అక్రమంగా మాంసం విక్రయిస్తున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న కొందరు వ్యక్తులను అధికారులు అదుపులోకి తీసుకున్నారు.అనంతరం వారిని పోలీసులకు అప్పగించి, కేసు నమోదు చేసి తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టారు. పశువులను నిబంధనలకు విరుద్ధంగా తరలించడం, అక్రమంగా వధించడం, మాంసాన్ని విక్రయించడం వంటి చర్యలకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.అక్రమ కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం ప్రజల దృష్టికి వస్తే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని వారు కోరారు.

ఘనంగా ఎండీ ఇమ్రాన్ జన్మదిన వేడుకలు

ఉద్యమపోరు, షాబాద్, అక్టోబర్ 4 : షాబాద్ మండల బిఆర్ఎస్ పార్టీ మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఎండీ ఇమ్రాన్ జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు,అభిమానులు, శ్రేయోభిలాషులు అధిక సంఖ్యలో హాజరై ఇమ్రాన్‌కు కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎండీ ఇమ్రాన్ మాట్లాడుతూ తన జన్మదినం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు చూపిన ప్రేమాభిమానాలు ఎప్పటికీ మరువలేనని అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

ఓబీసీ మహా గర్జనకు పెద్ద గోల్కొండ నుంచి 200 మంది కాంగ్రెస్ శ్రేణులు - ఆనేగౌని శ్రీకాంత్ గౌడ్

ఉద్యమపోరు, శంషాబాద్, అక్టోబర్ 4 : ఓబీసీలకు జనాభా ప్రాతిపదికన న్యాయమైన వాటా, హక్కులు కల్పించాలనే డిమాండ్‌తో నిర్వహించిన ఓబీసీ మహా గర్జన బహిరంగ సభకు పెద్దగోల్కొండ గ్రామం నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ ఆదేశాల మేరకు నార్సింగి మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆనేగౌని శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో సుమారు 200 మంది సభకు హాజరయ్యారు. శంషాబాద్‌లోని గొల్లపల్లి రోడ్డులో నిర్వహించిన ఈ బహిరంగ సభలో ఓబీసీ హక్కులు, సామాజిక న్యాయం, జనాభా ప్రాతిపదికన తగిన ప్రాతినిధ్యం కల్పించాలనే డిమాండ్లను బలంగా వినిపించారు. ఓబీసీల అభ్యున్నతికి, వారి హక్కుల సాధనకు ఐక్యంగా ముందుకు సాగాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా నాయకులు ప్రస్తావించారు. ఈ సందర్భంగా ఆనేగౌని శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ, ఓబీసీలకు న్యాయమైన వాటా, సముచిత హక్కులు కల్పించాలంటే ప్రతి ఒక్కరూ ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. సామాజిక న్యాయం సాధనలో బీసీల ఐక్యత ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఓబీసీలకు జనాభా ప్రాతిపదికన తగిన ప్రాధాన్యత, హక్కులు కల్పించాలనే డిమాండ్‌ను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లేందుకు ఇలాంటి సభలు దోహదపడతాయని అన్నారు. ఓబీసీల సంక్షేమం, అభివృద్ధి, రాజకీయ మరియు సామాజిక ప్రాతినిధ్యం కోసం జరిగే కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ మద్దతుగా నిలవాలని శ్రీకాంత్ గౌడ్ కోరారు. ఓబీసీల హక్కుల సాధన కోసం సంఘటితంగా ముందుకు సాగుతూ, సామాజిక న్యాయం లక్ష్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కే. దేవేందర్, రాజశేఖర్ రెడ్డి, బిక్షపతి, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నర్కుడలో రోడ్డు ప్రమాదం.. టిప్పర్ డ్రైవర్ మృతి

ఉద్యమపోరు, శంషాబాద్, అక్టోబర్ 4 : శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. నర్కుడ గ్రామంలోని హనుమాన్ ఆలయం సమీపంలో రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న టిప్పర్ డ్రైవర్‌ను కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన అతను చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకల్ మండలం రాచాల గ్రామానికి చెందిన గౌని జానకి రెడ్డి టిప్పర్ వాహనాల వ్యాపారం నిర్వహిస్తున్నారు. సుమారు నెల రోజుల క్రితం జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన, ప్రస్తుతం నార్కుడలో నివాసం ఉంటున్న అమిత్ కుమార్ రామ్ (34)ను తన టిప్పర్ వాహనం డ్రైవర్‌గా నియమించుకున్నారు. అక్టోబర్ 3వ తేదీ రాత్రి సుమారు 10 గంటల సమయంలో నిర్మాణ పనుల నిమిత్తం టిప్పర్ వాహనాలను నార్కుడ సమీపంలోని ప్రాంతానికి పంపించారు. అమిత్ కుమార్ రామ్‌తో పాటు మరో డ్రైవర్ కౌలేశ్వర్ బుయ్యా కూడా అక్కడికి వెళ్లారు. అక్టోబర్ 4వ తేదీ తెల్లవారు జామున సుమారు 12.30 గంటల సమయంలో అమిత్ కుమార్ రామ్ బాత్రూంకు వెళ్తున్నానని కౌలేశ్వర్ బుయ్యాకు చెప్పి సైట్ నుంచి బయటకు వెళ్లాడు. ఈ క్రమంలో నార్కుడ హనుమాన్ ఆలయం ఎదురుగా రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా, శంషాబాద్ నుంచి షాబాద్ వైపు వెళ్తున్న టి ఎస్ 09ఈజె8128 నంబర్ గల మారుతి స్విఫ్ట్ కారు అతివేగంగా, అజాగ్రత్తగా, నిర్లక్ష్యంగా వచ్చి అమిత్ కుమార్ రామ్‌ను ఢీకొట్టినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రమాదంలో అమిత్ కుమార్ రామ్ తలకు తీవ్ర గాయమైంది. సమాచారం అందుకున్న యజమాని జానకి రెడ్డి వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని 108 అంబులెన్స్ ద్వారా గాయపడిన అమిత్ కుమార్ రామ్‌ను చికిత్స నిమిత్తం ఉస్మానియా జనరల్ ఆసుపత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ అతను మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై జానకి రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు శంషాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శంషాబాద్‌లో దివంగత పట్లోళ్ల ఇంద్రారెడ్డి జయంతి వేడుకలు

ఉద్యమపోరు, శంషాబాద్, అక్టోబర్ 4 : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ హోంమంత్రి, చేవెళ్ల ప్రాంత ప్రజల అభిమాన నాయకుడు దివంగత పట్లోళ్ల ఇంద్రారెడ్డి జయంతి వేడుకలను శంషాబాద్‌లో బీఆర్ఎస్ నాయకులు నిర్వహించారు. పాల్మాకుల గ్రామ పంచాయతీ పరిధిలోని ఇంద్రారెడ్డి విగ్రహానికి బీఆర్ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్ రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజల కోసం నిరంతరం పనిచేసిన ఇంద్రారెడ్డి రాజకీయ జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. చేవెళ్ల నియోజకవర్గ ప్రజలతో ఆయనకు ఉన్న అనుబంధం ఎంతో ప్రత్యేకమైనదని, ప్రజలు ఆయనను తమ కుటుంబ సభ్యుడిగా భావించి నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించారని గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జైతెలంగాణ పార్టీని ఏర్పాటు చేసి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఇంద్రారెడ్డి సాగించిన పోరాటం చరిత్రలో నిలిచిపోయిందన్నారు. ప్రజా సమస్యలపై స్పందిస్తూ, అందరికీ అందుబాటులో ఉండే నాయకుడిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు లభించిందని పేర్కొన్నారు. ఇంద్రారెడ్డి ఆశయాలను ముందుకు తీసుకెళ్లడంతో పాటు ఆయన పాటించిన ప్రజాసేవా మార్గాన్ని నేటి తరం నాయకులు ఆదర్శంగా తీసుకోవాలని కార్తీక్ రెడ్డి సూచించారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేయడమే ఆయనకు నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో శంషాబాద్ మాజీ ఎంపీపీ చెక్కల ఎల్లయ్య ముదిరాజ్, మురళీధర్ రెడ్డి, శంషాబాద్ 118, 119వ డివిజన్ల బీఆర్ఎస్ అధ్యక్షులు కొలన్ ప్రదీప్ రెడ్డి, కొనమొల్ల శ్రీనివాస్, పెద్దషాపూర్ మాజీ సర్పంచ్ చెక్కల చంద్రశేఖర్, శ్రావణ్ గౌడ్, మంచర్ల శ్రీనివాస్, దీప మల్లేశ్, రాము నాయక్, గౌస్ పాషా తదితర బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

చిన్నారులను ఆశీర్వదించిన తల్లోజు ఆచారి

- **తలకొండపల్లి మండల అధ్యక్షుడు నీలకంఠం పాండు**



ఉద్యమపోరు, తలకొండపల్లి, సెప్టెంబర్ 18 : తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామానికి చెందిన చీపిరి వసంత – స్వామి యాదవ్ దంపతుల చిన్నారులు నందిత, నిఖిల్‌ల పుట్టువెంట్రుకలు, పుట్టుపంచల (పుట్టువెల) కార్యక్రమం మిడ్జిల్ మండలం ఫంక్షన్ హాల్ లో వైభవంగా జరిగింది. ఈ వేడుకకు జాతీయ ఓబీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి, బీజేపీ ముఖ్య నాయకులు ముఖ్య అతిథులుగా హాజరై, చిన్నారులను ఆశీర్వదించారు.ఈ సందర్భంగా తల్లోజు ఆచారితో పాటు పలువురు నేతలు చిన్నారులకు అక్షింతలు వేసి దీర్ఘాయుష్షుతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. అనంతరం వేడుకకు విచ్చేసిన అతిథులను చిన్నారుల తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు నీలకంఠం పాండు, గట్టు ఇప్పలపల్లి సర్పంచ్ జీనుకుంట్ల చంద్రశేఖర్, దళిత మోర్చా జిల్లా వైస్ ప్రెసిడెంట్ రాజు, బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ పద్మ అనిల్ సీనియర్ నాయకులు సుదర్శన్ రెడ్డి, వెంకటయ్య, బాలకృష్ణ, ఆరిఫ్, శ్రీశైలం, నర్సింహా,హరికాంత్,రాఘవేంద్రర్ గౌడ్, నాయక్, రవి మరియు యాదవ్ సంఘం నాయకులు, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకను విజయవంతం చేశారు.

TGTEL/26/A7716
ఉద్యమ పోరు
ప్రతి పదం పోరాట కదం
సోమవారం 05.10.2026

సౌర విద్యుత్‌తో విద్యుత్ ఖర్చులు తగ్గించుకోవచ్చు

- పర్యావరణ పరిరక్షణకు సౌర శక్తి వినియోగం దోహదం చేస్తుంది : మాజీ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి

ఉద్యమపోరు, నేరేడ్ మెట్, అక్టోబర్ 4 : సౌర విద్యుత్‌ను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని, సౌర శక్తిని విస్తృతంగా ప్రోత్సహించడం ద్వారా విద్యుత్ ఖర్చులను తగ్గించుకోవడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు దోహదపడవచ్చని వినాయక్‌నగర్ మాజీ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి అన్నారు.'సేవా సేతు అభియాన్' కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాజ్యలక్ష్మి మాట్లాడుతూ దేశంలో సౌర విద్యుత్ వినియోగాన్ని పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఇంటిలో సౌర విద్యుత్ వ్యవస్థను ఏర్పాటు చేసుకునేలా ప్రజలను ప్రోత్సహించాలని సూచించారు.సౌర విద్యుత్‌పై చాలామందికి ఇప్పటికీ పూర్తి స్థాయిలో అవగాహన లేకపోవడంతో ఇళ్లలో సౌర విద్యుత్ వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవడంపై ఆసక్తి చూపడం లేదన్నారు. తాను ఇంటి వద్ద సౌర విద్యుత్ వ్యవస్థను ఏర్పాటు చేసుకున్న తర్వాత స్థానికంగా పలువురు దానిపై ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. ఒకరి ఇంట్లో ఏర్పాటు చేసిన సౌర విద్యుత్ వ్యవస్థను చూసి మరొకరు కూడా అదే విధంగా ఏర్పాటు చేసుకునేందుకు ముందుకు రావడం సానుకూల పరిణామమని పేర్కొన్నారు.సౌర శక్తి వినియోగం పెరిగితే విద్యుత్ బిల్లుల భారం తగ్గడంతో పాటు సంప్రదాయ ఇంధన వనరులపై ఆధారపడటం తగ్గుతుందని రాజ్యలక్ష్మి తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు కూడా ఇది ఎంతో దోహదపడుతుందని అన్నారు. ప్రతి కుటుంబం తమకు సాధ్యమైన మేరకు సౌర విద్యుత్‌ను వినియోగించుకోవాలని ఆమె సూచించారు.భవిష్యత్‌లో సౌర విద్యుత్‌దే కీలక పాత్రకార్యక్రమంలో సైనిక్‌పురి విద్యుత్ శాఖ డీఈ/ఓపీ అన్వర్ పాషా మాట్లాడుతూ భవిష్యత్‌లో సౌర విద్యుత్‌పై ఆధారపడాల్సిన పరిస్థితి మరింత పెరుగుతుందని అన్నారు. ప్రజలు ఇప్పటి నుంచే సౌర విద్యుత్ వినియోగంపై దృష్టి సారించాలని సూచించారు.సౌర విద్యుత్ వ్యవస్థల ఏర్పాటుకు బ్యాంకులు సుమారు 6 శాతం వడ్డీతో రుణాలు అందిస్తున్నాయని తెలిపారు. దేశవ్యాప్తంగా కోటి కుటుంబాలకు సౌర విద్యుత్ అందించాలనే లక్ష్యంలో ఇప్పటికే 60 లక్షల కుటుంబాలు చేరాయని, మరో 40 లక్షల కుటుంబాలను ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేయాల్సి ఉందని వివరించారు.కార్యక్రమంలో ఏడీఈ/ఓపీ బాబయ్య, ఏడీఈ/ఐసీఎన్‌సీ పృథ్వీరాజ్, ఏఈ/ఓపీ లత, గంగాభవాని, వెంకట్‌రెడ్డి, బలరాజ్, బాబూరావు, బీజేపీ నాయకురాలు జ్యోతిర్మయి తదితరులు పాల్గొన్నారు.తనిఖీలు నిర్వహించి వాస్తవాలను ప్రజలముందుంచాలని కోరుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు ఉన్నట్లు తేలితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని, అధికారుల నిర్లక్ష్యం ఉంటే దానిపైనా ఉన్నతాధికారులు విచారణ జరపాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

మనుక పరమేషు యాదవ్ స్మారక క్రికెట్ టోర్నమెంట్ విజేతగా చింతల్ జట్టు

- ఫైనల్‌లో బూర్జు జట్టుపై 6 వికెట్ల తేడాతో ఘన విజయం.. విజేతలకు బహుమతులు అందజేత

ఉద్యమపోరు, శామీర్ పేట, అక్టోబర్ 04 : మూడుచింతలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పొన్నాల గ్రామంలో నిర్వహించిన మనుక పరమేషు యాదవ్ స్మారక క్రికెట్ టోర్నమెంట్‌లో చింతల్ జట్టు విజేతగా నిలిచింది. మూడు రోజులపాటు ఉత్సాహంగా సాగిన ఈ టోర్నమెంట్‌లో మొత్తం ఆరు జట్లు పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నాయి. హోరాహోరీగా సాగిన ఫైనల్ పోరులో బూర్జు జట్టుపై చింతల్ జట్టు ఆరు వికెట్ల తేడాతో విజయం సాధించి టోర్నమెంట్ విజేతగా నిలిచింది.

ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలి : అక్టోబర్ 8న కలెక్టరేట్ ఎదుట అఖిలపక్షం నిరసన

ఉద్యమపోరు, పినపాక, అక్టోబర్ 04 : ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ అక్టోబర్ 8వ తేదీన అఖిలపక్షం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పేరం వెంకటేశ్వర్లు, సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పత్తిపాటి నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు పినపాక మండలం ఈ బయ్యారం క్రాస్ రోడ్ లో గల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిరసన కార్యక్రమం నిర్వహణకు సంబంధించి అఖిలపక్ష నాయకులు సమావేశమై చర్చించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన అంశాలపై ప్రజల్లో అనేక సందేహాలు, ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో తమ అభ్యంతరాలను ప్రజాస్వామ్య పద్ధతిలో తెలియజేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఎన్నికల కమిషన్ వ్యవహారశైలిపై తమకు ఉన్న అభిప్రాయాలను నిరసన కార్యక్రమం ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు.అక్టోబర్ 8న జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించనున్న నిరసన కార్యక్రమానికి కాంగ్రెస్, సీపీఐతో పాటు అఖిలపక్షంలోని వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజాసంఘాల ప్రతినిధులు హాజరుకావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమాన్ని శాంతియుతంగా, ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్వహించనున్నట్లు తెలిపారు.ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు పూర్తి విశ్వాసం ఉండేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని నాయకులు కోరారు. ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలనే తమ డిమాండ్‌ను జిల్లా అధికారుల ద్వారా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు వెల్లడించారు.అఖిలపక్ష సమావేశంలో నిరసన కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లు, నాయకులు మరియు కార్యకర్తల భాగస్వామ్యం, కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో అఖిల పక్ష నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు రమానాథం, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ రమేష్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కంది సుబ్బారెడ్డి, లక్ష్మీరెడ్డి, సర్పంచులు, ఉపసర్పంచులు, మాజీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

రాష్ట్రస్థాయి ఎస్ జి ఎఫ్ క్రికెట్ కు పినపాక జడ్పీహెచ్ఎస్ విద్యార్థిని ఎంపిక

ఉద్యమపోరు,పినపాక, అక్టోబర్ 04 : గ్రామీణ ప్రాంత విద్యార్థులలో దాగి ఉన్న అసాధారణ క్రీడా ప్రతిభ మరోసారి వెలుగులోకి వచ్చింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి అభ్యసిస్తున్న కె. ప్రతీక చౌదరి రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–17 బాలికల క్రికెట్ జట్టుకు ఎంపికైంది.ఇటీవల ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలోని సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఎంపిక పోటీలలో ప్రతీక పాల్గొంది. ఈ ఎంపికల్లో జిల్లా వ్యాప్తంగా పలు పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థినులతో పోటీపడి, ఆల్ రౌండ్ ప్రతిభతో సెలక్టర్లను విశేషంగా ఆకట్టుకుంది. అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలలో ఉమ్మడి ఖమ్మం జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించే అర్హతను సాధించింది.గ్రామీణ స్థాయిలో తగిన వసతులు లేకపోయినా, పట్టుదలతో సాధన చేసి రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి. రామిరెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయురాలు డి. వరలక్ష్మి హర్షం వ్యక్తం చేశారు. ప్రతినిత్యం కఠిన శ్రమ, సరైన శిక్షణతోనే ప్రతీక ఈ స్థాయికి చేరుకుందని కొనియాడారు. త్వరలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీల్లోనూ ఇదే రకమైన ప్రతిభను కనబరిచి, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికై పాఠశాలకు, గ్రామానికి, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థినీ విద్యార్థులు ప్రతీకకు శుభాకాంక్షలు తెలిపారు.

పుట్ట మధూ.. ఇకనైనా పద్ధతి మార్చుకో

- అనుచిత వ్యాఖ్యలు, అబద్ధపు ప్రచారాలు మానుకోవాలి....కాంగ్రెస్ నేతలు

ఉద్యమపోరు, మంథని, అక్టోబర్-04 : మాజీ జెడ్పీటీసీ పుట్ట మధు ఇకనైనా తన వైఖరి మార్చుకుని అబద్ధపు ప్రచారాలు, అనుచిత వ్యాఖ్యలకు స్వస్తి పలకాలని మంథని మండల కాంగ్రెస్ నాయకులు సూచించారు. మంథని కూరగాయల మార్కెట్‌లో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో పుట్ట మధు ఇటీవల చేసిన వ్యాఖ్యలను వారు ఖండించారు.మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అయిలి ప్రసాద్, మున్సిపల్ చైర్మన్ పోద్దుా శ్రీనివాస్, వైస్ చైర్మన్ ముస్కుల సయేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కుదుదుల వెంకన్న తదితరులు మాట్లాడుతూ.. రాజకీయ ఉనికిని కాపాడుకునేందుకే పుట్ట మధు మంథని అభివృద్ధి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుపై పదేపదే విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. గతంలో ఆయనపై కమిషన్ రాజకీయాలు, ఇసుక దందాలకు సంబంధించి ఆరోపణలు ఉన్నాయని పేర్కొన్నారు.మంత్రి శ్రీధర్‌బాబు, ఆయన కుటుంబ సభ్యులను ఏకవచనంతో సంబోధిస్తూ వ్యక్తిగత విమర్శలు చేయడం రాజకీయ పరిణతికి నిదర్శనం కాదన్నారు. మంథని అభివృద్ధిపై చిత్తశుద్ధి ఉంటే నిర్మాణాత్మక సూచనలు చేయాలి తప్ప వ్యక్తిగత విమర్శలకు దిగకూడదని హితవు పలికారు. విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో మంథని అభివృద్ధికి శ్రీధర్‌బాబు కృషి చేస్తున్నారని తెలిపారు.మున్సిపల్ ఎన్నికల్లో పుట్ట శైలజను పోటీకి నిలబెట్టకపోవడంపైనా కాంగ్రెస్ నాయకులు ప్రశ్నించారు. అధికారంలో ఉన్నప్పుడు పదవులను కుటుంబ ప్రయోజనాలకు అనుకూలంగా ఉపయోగించుకోవాలనే ధోరణితో వ్యవహరించారని ఆరోపించారు. కాంగ్రెస్ పాలకవర్గం ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తల సమష్టి కృషితో ఏర్పడిందని స్పష్టం చేశారు.ఇకనైనా వ్యక్తిగత విమర్శలు, అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలని.. లేకపోతే రాజకీయంగా తగిన సమాధానం ఇస్తామని కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఉప సర్పంచులు, యూత్, మహిళా కాంగ్రెస్ నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కరాటేకు మంథని క్రీడాకారులు

- SGFI అండర్-19 పోటీలకు హాసిని, దేవాన్ష్ ఎంపిక

ఉద్యమపోరు, మంథని, అక్టోబర్-04 : మంథని జేకేపీ షోటోఖాన్ కరాటే క్రీడాకారులు అండర్–19 SGFI రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జగిత్యాలలోని పొన్నం గార్డెన్స్‌లో ఈ నెల 3న నిర్వహించిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా అండర్–19 కరాటే ఎంపిక పోటీల్లో మంథని క్రీడాకారులు ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు సాధించారు.మంథనికి చెందిన తోట హాసిని 40 కిలోల విభాగంలో, దుల్జత్ దేవాన్ష్ 70 కిలోల విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి నవంబర్ 5, 6, 7 తేదీల్లో ఖమ్మంలో నిర్వహించనున్న SGFI అండర్–19 రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు ఎంపికయ్యారు. వీరు జేకేపీ షోటోఖాన్ కరాటే ఇన్‌స్ట్రక్టర్ కొండ్ర నాగరాజు వద్ద శిక్షణ పొందుతున్నారు.క్రీడాకారులను జేకేపీ సౌత్‌జోన్ ఇన్‌చార్జి రాపోలు సుదర్శన్, తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు నూకల బానయ్య, తెలంగాణ పేటా ఉపాధ్యక్షులు ఫిజికల్ డైరెక్టర్ కొమురోజు శ్రీనివాస్, జూనియర్ కోచ్ బొడ్డేల ఇంద్రాణి, పెద్దపల్లి జిల్లా కరాటే మాస్టర్స్ అభినందించారు.

మాజీ ఎంపీపీ బానోత్ మాధవి కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి పొంగులేటి.

ఉద్యమపోరు, ఏన్కూర్, అక్టోబర్ 4 : ఏన్కూరు మండల మాజీ ఎంపీపీ బానోత్ మాధవి– రామారావు తల్లి ఝుంకు ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, వైరా ఎమ్మెల్యే మాలోత్ రామదాస్ నాయక్ ఆదివారం భగవాన్ నాయక్ తండ గ్రామానికి వెళ్లి మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ సందర్భంగా ఝుంకు చిత్రపటానికి నివాళులర్పించిన అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి, ధైర్యంగా ఉండాలని సూచించారు. మృతురాలి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు స్వర్ణ నరేందర్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ లచ్చిరాం నాయక్, విజయ భాయి, బొర్రా రాజశేఖర్, కొప్పుల ప్రభావతి రెడ్డి, లేళ వెంకటరెడ్డి, మండల నాయకులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్‌లో దసరా షాపింగ్ ఫెస్టివల్ ప్రారంభం.

ఉద్యమపోరు, నిజామాబాద్, అక్టోబర్ 04 : నిజామాబాద్ నగరంలో పండుగ సందడి మొదలైంది.సౌత్ ఇండియా షాపింగ్ మాల్ ఎదురుగా,బస్టాండ్–రైల్వే స్టేషన్ సమీపంలో "దసరా షాపింగ్ ఫెస్టివల్" ఆదివారం ఘనంగా ప్రారంభమైంది.ఇంటికి అవసరమైన అనేక రకాల వస్తువులు ఒకే చోట అందుబాటులో ఉండటంతో కుటుంబాలు పండుగ షాపింగ్‌ను ఒకేచోట పూర్తి చేసుకునే అవకాశం కలుగుతోంది.పిల్లల కోసం ఉయ్యాలలు,రైడ్స్‌తో పాటు భారీ ఇన్‌ఫ్లేటబుల్ స్లైడ్‌ను కూడా ఏర్పాటు చేశారు.ఈ ఫెస్టివల్ దసరా,దీపావళి పండుగల వరకు కొనసాగనుంది.కాంగ్రెస్ నాయకులు కూరగాయల రమేష్ ప్రత్యేక అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ఫెస్టివల్‌ను ప్రారంభించారు.డిప్యూటీ మేయర్ భర్త,ఎంఐఎం నగర అధ్యక్షులు షకీల్ అహ్మద్ ఫాజిల్ కూడా పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ఐయూఎంఎల్ నాయకులు షేక్ ముజాహిద్,అశోక్ రెడ్డి,విలాస్ రెడ్డి,నయీమ్ ఖమర్,రఫీక్ ఖురేషి,హలీమ్ ఖమర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్ ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి చేతుల మీదుగా మహదేవ్ ఇన్ఫ్రా డెవలపర్స్ బ్రోచర్ లాంచింగ్

ఉద్యమపోరు, నాగోల్, అక్టోబర్ 4 : హైదరాబాద్: నాగోల్మహాదేవ్ ఇన్‌ఫ్రా డెవలపర్స్ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్మించనున్న మెగా గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్‌మెంట్స్‌కు భూమి పూజ, బ్రోచర్ ప్రారంభోత్సవ కార్యక్రమం నాగోల్‌లో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్, ఎల్‌బీ నగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై భూమి పూజలో పాలొని, ప్రాజెక్టు బ్రోచర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ, హైదరాబాద్ నగరంలో పెరుగుతున్న జనాభా, నివాస అవసరాలకు అనుగుణంగా నాణ్యమైన, ఆధునిక వసతులతో గేటెడ్ కమ్యూనిటీల నిర్మాణం అవసరమని అన్నారు.ప్రజలకు నమ్మకమైన, నాణ్యమైన నిర్మాణాలను అందించేందుకు నిర్మాణ సంస్థలు కృషి చేయాలని సూచించారు. మహాదేవ్ ఇన్‌ఫ్రా డెవలపర్స్ చేపడుతున్న ప్రాజెక్టు విజయవంతం కావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ బీ. లింగయ్య యాదవ్, మాజీ మేయర్ జక్కా వెంకట్ రెడ్డి, మాజీ సీనియర్ నాయకులు పెరాల శేఖర్, మాజీ కార్పొరేటర్ అరుణ సురేందర్ యాదవ్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సుధాకర్ గాండే, సింగర్ నల్గొండ గద్దర్, బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు పద్మా రెడ్డి, బిల్డర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అకుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.అలాగే పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రముఖులు, నిర్మాణ రంగ ప్రతినిధులు, మహాదేవ్ ఇన్‌ఫ్రా డెవలపర్స్ ప్రతినిధులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

హైదరాబాద్‌లో ఘనంగా అఖిల భారతీయ శిక్షా భూషణ్ సమ్మాన్ సమారోహ్

- ముగ్గురు ప్రముఖ విద్యావేత్తలకు పురస్కార ప్రదానం
- భారతీయ విద్యా వ్యవస్థ అభివృద్ధికి విశేష సేవలందించిన వారికి ఘన సత్కారం

ఉద్యమపోరు, నాగోల్, అక్టోబర్ 4 : భారతీయ విద్యా వ్యవస్థ అభివృద్ధికి విశేష సేవలందించిన ప్రముఖ విద్యావేత్తలను ఘనంగా సత్కరించారు. అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక్ మహా సంఘ్ (ఏబీఆర్ఎస్ఎం) ఆధ్వర్యంలో నాగోల్‌లోని శుభం కన్వెన్షన్ సెంటర్‌లో శనివారం సాయంత్రం నిర్వహించిన అఖిల భారతీయ శిక్షా భూషణ్ సమ్మాన్ సమారోహ్ వైభవంగా జరిగింది. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన విద్యావేత్తలు, ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాజీ యూజీసీ ఛైర్మన్, ప్రస్తుతం ఐఐఎం కలకత్తా బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్న పద్మశ్రీ ప్రొఫెసర్ మామిడాల జగదీష్ కుమార్, ఐఐఎం బెంగళూరు మాజీ ప్రొఫెసర్, డీన్ ప్రొఫెసర్ బి. మహదేవన్, విశాఖపట్నంలోని విజ్ఞాన విహార విద్యాసంస్థల మాజీ ప్రిన్సిపాల్ డి. రామకృష్ణారావులను పురస్కారాలతో సత్కరించారు.జాతీయ విద్యా విధానం–2020 అమలు, ఉన్నత విద్యలో సంస్కరణలు, ప్రాంతీయ భాషల్లో విద్యాబోధన, ఆన్‌లైన్ విద్యా విస్తరణలో ప్రొఫెసర్ మామిడాల జగదీష్ కుమార్ అందించిన సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. భారతీయ జ్ఞాన వ్యవస్థ, సంస్కృత విద్య, మేనేజ్‌మెంట్ రంగాల్లో ప్రొఫెసర్ బి. మహదేవన్ చేసిన కృషిని ప్రశంసించారు. విద్యా విధానాల రూపకల్పన, ఉపాధ్యాయ శిక్షణ, నైతిక విద్య, పాఠశాల విద్యలో సామాజిక పరివర్తనకు డి. రామకృష్ణారావు అందించిన సేవలను గుర్తుచేశారు.ఈ కార్యక్రమానికి రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ సహ సర్కార్యవాహ్ పూజ్య సి.ఆర్. ముకుంద జీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఏబీఆర్ఎస్ఎం జాతీయ అధ్యక్షుడు ప్రొఫెసర్ నారాయణ్ లాల్ గుప్తా అధ్యక్షత వహించారు.పరమపూజ్య త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి మంగళాశాసనం అందించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. భారతీయ విద్యా చింతన, గురు పరంపర, విలువలతో కూడిన విద్యా విధానం దేశ భవిష్యత్తుకు కీలకమని పేర్కొన్నారు. విద్యా రంగంలో విశేష సేవలందిస్తున్న వారిని గుర్తించి సత్కరించడం ద్వారా ఉపాధ్యాయ లోకానికి స్ఫూర్తి కలుగుతుందని తెలిపారు. ఏబీఆర్ఎస్ఎం జాతీయ కార్యదర్శి ఆచార్య గీతా భట్, ఆర్గనైజింగ్ కార్యదర్శి మహేంద్ర కపూర్, జాయింట్ ఆర్గనైజింగ్ సెక్రటరీతో పాటు తెలంగాణ రాష్ట్రానికి చెందిన కిషన్ జీ, ఏలూరి యాదయ్య, డాక్టర్ కె. భాస్కర్, జగన్, దయానంద్ ఆర్య తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతినిధులు, విద్యావేత్తలకు తెలంగాణ రాష్ట్ర శాఖ కన్వీనర్ ఏలూరి యాదయ్య కృతజ్ఞతలు తెలిపారు.

హకీంపేట్ ఆర్టీసీ డిపోలో కాంగ్రెస్ జోరుగా ప్రచారం

- కార్మికుల సంక్షేమం, సమస్యల పరిష్కారానికి అండగా ఉంటాం: రాములు నాయక్

ఉద్యమపోరు, శామీర్ పేట, అక్టోబర్ 4, : తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల నేపథ్యంలో హకీంపేట్ ఆర్టీసీ డిపోలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రచారం జోరుగా సాగింది. అక్టోబర్ 9న జరగనున్న గుర్తింపు సంఘం ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మద్దతు ప్రకటించిన తెలంగాణ వర్కర్స్ యూనియన్ (టిడబ్ల్యూయూ) అభ్యర్థులకు మద్దతు ఇచ్చి బాణం గుర్తుపై ఓటు వేయాలని నాయకులు కార్మికులను కోరారు.మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, హకీంపేట్ డిపో గౌరవ అధ్యక్షుడు భీమిడి జైపాల్ రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు డిపోలోని కార్మికులను కలిసి ఎన్నికల ప్రాధాన్యతను వివరించారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల సంక్షేమం, వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తోందని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో కార్మికులకు ఇచ్చిన అనేక హామీలు అమలుకు నోచుకోలేదని విమర్శించారు. ప్రస్తుతం కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటిని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. కార్మికుల హక్కులు, సంక్షేమం, ఉద్యోగ భద్రతకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు.జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ హకీంపేట్ డిపో కార్మికుల సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ సమస్యలను సంబంధిత ప్రభుత్వ పెదల దృష్టికి తీసుకెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.హకీంపేట్ డిపో గౌరవ అధ్యక్షుడు భీమిడి జైపాల్ రెడ్డి మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరంతరం అండగా ఉంటామని అన్నారు. కార్మికుల సంక్షేమం కోసం పనిచేసే యూనియన్‌కు మద్దతు ఇవ్వాలని కోరారు.కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి. మహిపాల్ రెడ్డి, అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు టి. రమేష్, మూడు చింతలపల్లి మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు డి. వెంకటేశం, మేడ్చల్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎన్. నాగరాజు, హకీంపేట్ డిపో అధ్యక్షుడు తులసీరామ్, కార్యదర్శి పవన్ యాదవ్, మాజీ కాంగ్రెస్ అధ్యక్షుడు వైస్ గౌడ్, మాజీ ఎంపీటీసీ ఎస్. మధుసూదన్ రెడ్డి, మాజీ సర్పంచులు ఎ. నగేష్ యాదవ్, బి. కిషోర్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు ఎస్. వేణుగోపాల్ రెడ్డి, ఆర్. శ్రీనివాస్ యాదవ్, వి. నర్సింహారెడ్డి, విష్ణు, ఎస్. ఆనంద్, పి. బాలరాజు, వి. శేషాంత్, భరత్ కుమార్, నాగరాజు, ఆర్టీసీ యూనియన్ ప్రతినిధులు కృష్ణ, శ్రీశైలం, పుష్పలత, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

సమీక్ష సమావేశంలో ప్రోటోకాల్ పాటించని ఎమ్మెల్యే తీరు మార్చుకోవాలి

- సిపిఎం మంచాల మండల కార్యదర్శి రావుల జంగయ్య.
- సిపిఎం పార్టీ సర్పంచ్ ల సమస్యలు పట్టించుకోని ఎమ్మెల్యే నియంత పోకడలు మానుకోవాలి

ఉద్యమపోరు, ఇబ్రాహీంపట్నం, సెప్టెంబర్ 4 : మంచాల మండలం కేంద్రం లో జరిగిన సమావేశంలో సిపిఎం పార్టీ గ్రామ సర్పంచ్ ల తో కలిసి సిపిఎం మండల కార్యదర్శి రావుల జంగయ్య మాట్లాడుతూ మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో సిపి ఎం పార్టీ సర్పంచ్ లు చెప్పిన సమస్యలు సిపిఎం పార్టీపై నిం దలు వేస్తూ ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సర్పంచ్ లకు ప్రోటోకాల్ పాటించకుండా కాంగ్రెస్ కా ర్యకర్తలను అనుచరులను సమావేశానికి హాజరుపరిచి ప్రజాప్రతినిధులను అవమానించిన ఎ మ్మెల్యే ఆయన ప్రవర్తన మార్చుకోవాలని అన్నారు. ఆయన ప్రవర్తన మార్చుకోకపోతే తగిన రీతిలో బుద్ధి చెప్పవలసి వస్తుందని తెలిపారు సర్పంచ్ లను గౌరవించకుంటే రాబోయే కాలంలో ప్రజలే చూసుకుంటారని తెలిపారు. బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు స ర్పంచ్ ల భర్తలు సమావేశానికి హాజరవుతున్నారని ఇదెక్కడి న్యాయమని అన్నారు. ప్రోటకల్ పాటించాలని విజ్ఞప్తి చేశారు అలాగే సిపిఎం పార్టీపై నిందలు వేయడం మానుకోవాలని అన్నారు ఈకార్యక్రమంలో రంగాపూర్ గ్రామసర్పంచ్ నేనావత్ బాలకృష్ణ నాయక్ చెన్నారెడ్డి గూడా గ్రామసర్పంచ్ పగడాల విజయ ఎల్లమ్మతండా సర్పంచ్ సపవట్ జవహర్ లాల్ బండాలేమూర్ గ్రామసర్పంచ్ పాతులోత్ శ్రీనివాస్ నాయక్ సిపిఎం పార్టీ మంచాల మండలం కార్యవర్గ సభ్యుడు అన్నారం లెనిన్ కాళ్ళ జంగయ్య ఆవుల యాదయ్య సీనియర్ నాయకులు మహమ్మద్ యూసుఫ్ ఆలీ పగడాల వెంకటేష్ ,నూకం రవి ,ముదిరాజ్ యస్ డి హాఫీజ్ పాష తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by Bandari Srujana, on behalf of Sri Venkateswara Printing Solutions, Editor - Bandari Sumanth, is responsible for news selection under PRB act
prgi.gov.in RNI.TGTEL/26/A7716, # 19-212/3-3A, Narsampet, Warangal, Telangana, India - 506132, Cell : 7569337969 Email:udyamaporu@gmail.com